

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

24-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 235 పేజీలు: 16 వెల: 6.50



సిఇసి, ఎన్నికల కమిషనర్ నియామకాలపై భిన్నతీర్పు 2

# కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు

**రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఏర్పాటు**

**రాజధాని అమరావతి అభివృద్ధి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం**

**2027లోగా హంద్రీ-నీవా పనులు పూర్తవ్వాలి.. పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్**

**న్యాయాధికారుల పదవీవిరమణ 62 యేళ్లకు పెంపు**

60కి పైగా అంశాలపై మంత్రివర్గ సమావేశం చర్చ... కీలక నిర్ణయాలు

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదే**

**కేబినెట్ భేటీ అనంతరం మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**



బుధవారం అమరావతిలో నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడు, సిఎస్ సాయిప్రసాద్

**అమరావతి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో 60కి పైగా అంశాలపై చర్చించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి రాజధానిలో పనులకు అనుమతుల మంజూరు, రైతులకు కౌలు పెంపు వంటి నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. వీటితో పాటు రాష్ట్రంలో పలు పరిశ్రమలు, ఇతర అవసరాలకు భూకేటాయింపులు కూడా చేసింది.

**పెట్టుబడులకు ఆమోదం:**

మై హోమ్, క్యాటర్‌పిల్లర్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తదితర పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, కుప్పం పరిధిలో పలు పరిశ్రమలకు భూకేటాయింపులు, ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విద్యుత్ రంగంలో పలు సోలార్, విండ్, హైబ్రిడ్ ప్రాజెక్టులతో పాటు 1,344 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, 500 మెగావాట్ల ఎనర్జీ స్టోరేజ్ సేకరణకు ఆమోదం తెలిపారు. ఎల్‌పిఎస్ రైతులకు >>2



## కళింగపట్నం వద్ద తీరందాటిన 'వాయుగుండం'

రెండు రోజులు దంచికొట్టనున్న వర్షాలు

నదులకి ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం

ఇప్పటికే అంచనాలకు మించి వంశధార, నాగావళి

ఉత్తరాంధ్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

అప్రమత్తమైన అధికారులు.. ఎప్పటికప్పుడు పరిస్థితులు అంచనా, కంట్రోల్‌రూంలు ఏర్పాటు

**శ్రీకాకుళం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** సముద్రం నుంచి ముప్పు ముంచుకొచ్చింది. ఆకాశం నుంచి వర్షం విరుచుకుపడుతోంది.. నదులు ఉరకలేస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి సమయంలో కళింగపట్నం సమీపంలో వాయుగుండం తీరం దాటింది. ఈ ప్రభావం వల్ల గురువారంవరకూ ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లాను వర్షాలు ముంచెత్తుతుండగా ఎగువ >>2



## కేబినెట్ పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్

ఢిల్లీలో ప్రధాని మోడీ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల చింతన్ శిబిర్

వికసిత్ భారత్ లక్ష్యాలపై చర్చలు 2లో

## ఎపి బిజెపి ఇన్‌చార్జ్‌గా అరవింద్ భదౌరియా 2లో

సహ ఇన్‌చార్జ్‌గా వనతి శ్రీనివాసన్ నియామకం



ఒడిశా రాష్ట్ర ఇన్‌చార్జీగా పురందేశ్వరికి బాధ్యతలు

తమిళనాడు కో-ఇన్‌చార్జీగా డికె అరుణ

పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఉత్తర్వులు



## టెక్కలిలో ఘోర ప్రమాదం 2లో

- రైలు ఢీకొని నలుగురు దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు
- చేపలు పట్టడానికి నౌపడ వైపు ట్రాక్‌పై నడిచి వెళ్తుండగా ఘటన

## సూపర్ ఎల్‌నినో యమ డేంజర్

వాతావరణంలో పెను మార్పులు తథ్యం

రాబోయే ఆరు నెలల్లో 4.51 లక్షల మరణాలు

భారత్‌లో 15,800 మరణాల అంచనా

క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తాజా అధ్యయనం



## లోకేష్ రాజీనామా చేయాలి

డిఎస్సీ2025పై సిబిఐ విచారణ జరిపించాలి

'శాప్ట్ కార్యాలయం వద్ద దాడి ఘటనపై అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్, గవర్నర్‌తో భేటీ.. వినతిపత్రం అందజేత 2లో



24-09pg2exHMNWJQEL.qxd:24-09pg2exHMNWJQEL.qxd 1/1/02 6:17 AM Page 1





బుధవారం గౌహతీలో రైజోర్‌దళ్ ఎమ్మెల్యే అఖిల్ గగోయ్ వరద బాధితులకు పరిహారం డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

# 'వాయుగుండం'

>> ప్రాంతాల నుంచి వంశధార, నాగావళి, బాహుదా నదులలోకివరద నీరు వచ్చి నదులకు ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం పొంచిఉంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతుంది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డిలు పూర్తి అప్రమత్తతో వ్యవహరిస్తూ మండల, గ్రామస్థాయి సిబ్బందిని అలెర్ట్ చేసారు. లోతట్టు ప్రాంతాలలో వారిద్దరూ వేర్వేరుగా పర్యటిస్తూ ప్రజలకు సూచనలు చేస్తున్నారు. వాయుగుండం తీరాన్ని తాకే సమయంలో ఈదురుగాలులు, భారీ వర్షాలతోపాటు నదీతీరాల్లో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. తీరం దాటే ఆ కొన్ని గంటలే ఇప్పుడు కీలకం కావడంతో యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

**దంచికొడుతున్న వాన**

గత 24 గంటల్లో శ్రీకాకుళం జిల్లాలో సగటున 67.3 మి.మీ. (8.7 సెం.మీ.) వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 30 మండలాలకు గాను 26 మండలాల్లో ఐదు సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. పలాసలో అత్యధికంగా 14.1 సెం.మీ. వర్షం కురిసింది. జి.సిగడాం మండలంలో అత్యల్పంగా 4.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సోంపేటలో 134.6 మి.మీ., కంచిలిలో 130.8, వజ్రపుకొత్తూరులో 128.2, సంతబొమ్మాళిలో 113.8, కోటబొమ్మాలిలో 112.2, టెక్కలిలో 109.4, కవిటిలో 107.2, 80 102.6, జలుమూరులో 100.6, నరసన్నపేటలో 98.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**నదులకు వరద పోటు**

భారీ వర్షాలతో జిల్లాలోని ప్రధాన నదుల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతాలనుంచి వరదనీరు పోటెత్తుతుండటంతో వంశధారలో ప్రవాహం ఉధృతమవుతోంది. గొట్టా బ్యారేజీకి 17 వేల క్యూసెక్కులకు పైగా నీరు చేరుతుండగా.. 15 వేల క్యూసెక్కులకు పైగా దిగువకు విడుదల చేస్తున్నారు. నాగావళి నదిలోనూ నీటిమట్టం పెరుగుతోంది. నదీతీర ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**తుఫాన్ ధాటికి పలు చోట్ల కూలిన ఇళ్లు**

ఇచ్ఛాపురం మండలం పురుషోత్తపురంలో రెండు, ఈదుపురంలో ఒకటి, మరో వైపు కంచిలి మండలం, బూరగాంలో మూడు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇల్లు కూలిపోవడంతో ఆందోళనలో బాధిత కుటుంబాలు ఉన్నాయి.

**పునరావాస కేంద్రాల ఏర్పాట్లు**

వర్షాలు, వరదల నేపథ్యంలో తీర ప్రాంతాలు, పల్లపు ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అవసరమైన చోట ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ భోజనం, తాగునీరు, ప్రాథమిక వైద్యం తదితర సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు.

# సిఇసి, ఎన్నికల కమిషనర్ నియామకాలపై భిన్నతీర్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా లేదా అనే అంశంపై ఇద్దరు సభ్యుల ధర్మాసనంలో ఏకాభిప్రాయం కుదరలేదు. 2023లో తీసుకొచ్చిన చట్టంలోని కొన్ని నిబంధనలను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ముఖ్యంగా సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో సీజేఐ పాత్ర ఉండగా 2023 చట్టం ప్రకారం ఎంపిక ప్యానెల్‌లో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండే విధానం వచ్చింది. ఈ మార్పు రాజ్యాంగబద్ధతపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఈ పిటిషన్లను ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ అంశాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందా అనే విషయంలో న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించారు.

# కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు

>> కనీస యాన్యుటీ, పలు హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 61 నుంచి 62 యేళ్లకు పెంపు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీ, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్సైజ్ పాలసీ, వార్డు సచివాలయాల్లో పదోన్నతి మార్గాల ఏర్పాటుపైనా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు పెట్టుబడుల ఆకర్షణపై కూడా మంత్రివర్గం దృష్టి సారించింది. విశాఖలో ముత్తూట్ ఫిన్‌కార్ప్‌కు డెలాయిట్ టచ్ టొమాట్సు ఇండియా ఎల్ఎల్‌పీకి ఐటీ/ ఐటిఇఎస్ క్యాంపస్, క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద ఏడు సంస్థలకు భూమి, కార్యాలయ స్థలం, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. పర్యాటక రంగంలోనూ పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతిలో ఫోర్ స్టార్ హోటల్, కడపలో త్రీ స్టార్ హోటల్, రేణిగుంటలో ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, స్టీల్, సిమెంట్, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలపైనా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్సైజ్ పాలసీ, వార్డు సచివాలయాల్లో పదోన్నతి మార్గాల ఏర్పాటు తదితర అంశాలకు కూడా ఆమోదం తెలిపింది.

**ల్యాండ్ పూలింగ్ రైతుల విషయంలోనూ కీలక నిర్ణయాలు:**

రాజధాని నిర్మాణంలో తదుపరి దశ పనులకు మంత్రివర్గం నిధులు కేటాయించింది. అమరావతి గ్రామ పంచాయతీల్లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పనులకు పరిపాలనా అనుమతిని రూ.904 కోట్ల నుంచి రూ.1,548.98 కోట్లకు పెంచింది. అదనంగా రూ.644.98 కోట్లతో నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, స్టార్మ్ వాటర్ నెట్‌వర్క్, రోడ్లు, వీధి దీపాల పనులను విస్తరించనుంది. అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్టులు తదితర నిర్మాణ పనులకు రూ.661 కోట్ల పరిపాలనా అనుమతికి ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ రైతుల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఒక ఎకరం కంటే తక్కువ పొడి, జరీబు భూములు ఇచ్చిన అర్హులైన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలు సవరించింది. ఇప్పటికే 1,304 మంది ఎల్‌పీఎస్ భూయజమానులకు చెల్లించిన రూ.5.04 కోట్ల యాన్యుటీని ర్యాటిఫై చేసింది. వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రుల బృందం చేసిన సిఫార్సులకు ఆమోదం తెలపడంతో పాటు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో స్ట్రీట్ వెండర్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీల ఏర్పాటుకు అనుమతించింది.

**హంద్రీనీవా పనులు 2027లోగా పూర్తవ్వాలి:**

హంద్రీనీవా సుజల స్రవంతి పనులపై సిఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. 2027లోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేబినెట్ సమావేశంలో హంద్రీనీవా సుజల స్రవంతి, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని సిఎం అడిగారు. హంద్రీనీవా సుజల స్రవంతి) ఫేజ్-2 పనుల పురోగతి, శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ, పనుల పూర్తిపై ఆరా తీశారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2లో మిగిలిన పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను 2027 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లికి స్పష్టం చేశారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు సంబంధించి 490 - 535 కిలో మీటర్ల వరకు సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు కూడా సమగ్రంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. పనులు పూర్తయితే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ద్వారా మంచినీరు, సాగునీటి అవసరాలు తీరడంతో పాటు సుమారు 25 వేల ఎకరాల ఖాళీ చెరువులను నింపి ప్రజలకు నీటి భరోసా కల్పించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి మండిపల్లి తెలిపారు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కెనాల్‌తో అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. హంద్రీనీవా పనులకు ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమావేశంలో కృతజ్ఞతలు తెలియజేశారు.

**స్థానిక ఎన్నికల్లో గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదే:**

రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నించే శక్తులకు ప్రజలు కచ్చితమైన గుణపాఠం చెబుతారని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. డిఎస్సీపై ప్రత్యర్థి పార్టీ రాద్ధాంతమంతా కుట్రపూరితమన్నారు. ఆ పార్టీ కుట్రలు సంఘటితంగా కూటమి పక్షాలు ఎదుర్కోవాలన్నారు. మంత్రులు ఈ విషయంలో మరింత చురుగ్గా స్పందించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలో గెలుపు బాధ్యత పూర్తిగా ఇన్‌చార్జ్ మంత్రులే తీసుకోవాలన్నారు. ప్రత్యర్థుల చేసే కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# కేబినెట్ పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్

## ఢిల్లీలో ప్రధాని మోడీ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల చింతన్ శిబిర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిమండలి రెండు రోజుల చింతన్ శిబిర్ సమావేశం బుధవారం నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రారంభం అయింది. ఢిల్లీలోని సేవాతీర్థ్‌లో రెండురోజులు జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వ శాఖల్లో కొనసాగుతున్న పనుల పురోగతితో పాటు వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర చర్చల అజెండా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. దీనితోపాటు మంత్రివర్గ శాఖల పనితీరు, మంత్రులపనితీరుపైనా ప్రోగ్రెస్ రిపోర్టుపై సమీక్ష చేయాలని ప్రధానిమోడీ నిర్ణయించారు. దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కొనసాగుతున్న కార్యక్రమాలను సమీక్షించడం ఈ చింతన్ శిబిర్‌లో ప్రధాన అంశంగా ఉండనుంది. వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాల్లో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు తదుపరి దశలో చేపట్టాల్సిన సంస్కరణలు, ప్రాధాన్యతలు, కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. వికసిత్ భారత్ కార్యాచరణ 2021 నుంచే కొనసాగుతోంది. ఇందులో భాగంగా విజన్ 2047 డాక్యుమెంట్‌తో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు 10 సెక్టోరల్ గ్రూప్స్ ఆఫ్ సెక్రటరీస్‌ను ఏర్పాటు చేశారు. వివిధ వర్గాల భాగస్వాములతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు కూడా నిర్వహించారు. ఇప్పటివరకు వికసిత్ భారత్ 2047కు సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రిమండలి ఎనిమిది ప్రదర్శనలు, చర్చలు నిర్వహించింది. చింతన్‌శిబిర్ సమావేశం ద్వారా సెక్రటరీల గ్రూపులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, క్యాబినెట్ సెక్రటేరియట్, నీతి ఆయోగ్ చేపట్టిన పనులను సమన్వయం చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. ప్రధానంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజల జీవన సౌలభ్యం, ప్రభుత్వ నిబంధనల భారాన్ని తగ్గించడం, సులభమైన పాలన వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ సమావేశం ఒక్కసారితో ముగిసేది కాదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాబోయే రోజుల్లో మరిన్ని దశల్లో చర్చలు నిర్వహించే అవకాశం ఉంది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ సప్తధార పేరుతో దేశ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ఏడు కీలక రంగాలను ప్రస్తావించారు. భారత్ కేవలం విడిభాగాల తయారీకి పరిమితం కాకుండా పూర్తి ఉత్పత్తులను తయారు చేసే స్థాయికి ఎదగాల్సిన అవసరాన్ని మోడీ ప్రస్తావించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయం, ఆహార ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రైతుల రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్లు, రోబోటిక్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ సాంకేతిక రంగంలో తన సామర్థ్యాలను పెంచుకోవాలని మోడీ పేర్కొన్నారు. రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు వంటి మౌలిక వసతులు, రవాణా అనుసంధానంపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. మెరుగైన కనెక్టివిటీ వాణిజ్యం, లాజిస్టిక్స్, వ్యాపారాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించడం, దేశీయ రక్షణ ఉత్పత్తులను పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ రంగం ప్రధాన లక్ష్యంగా ఉంది. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్వచ్ఛమైన, హరిత ఇంధన సాంకేతికతల్లో ఆవిష్కరణలను పెంచాల్సిన అవసరాన్ని మోడీ నొక్కిచెప్పారు.

## వారం - వర్జ్యం

24-09-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.త్రయోదశి రా.11.14, న.ధనిష్ఠ ఉ.10.32
వ.సా.5.58 - రా.7.37
దు.ఉ.9.58 - ఉ.10.46
2) మ.2.48 - 3.36
రాహు మ.1.30-3.00, శుభ స. ఉ.7.00 - ఉ.8.00.

## వార్తాఫలం

**మేషం:** లౌక్యం లోపించడం వలన కొన్ని సమస్యలు ఏర్పడినా దైవానుగ్రహం వలన చెప్పుకోదగిన ఇబ్బందులేర్పడవు.

**వృషభం:** వైజ్ఞానిక విషయాలు ఆకర్షిస్తాయి. ఋణం ఇవ్వడం తీసుకోవడం రెండూ తగదు. నూతన వస్తుకొనుగోలు.

**మిథునం:** మిత్రబృందాలతో జరిపే చర్చలు ఆహ్లాదకరంగా సాగుతాయి. ఇతరుల మితిమీరిన సలహాలు విసుగుపుట్టిస్తాయి.

**కర్కాటకం:** కాలానుగుణంగా మార్పులు అవసరమని భావిస్తారు. రచనా, వ్యాసంగాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు.

**సింహం:** శుభకార్యాలకు సంబంధించిన విషయంలో మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

**కన్య :** మిత్రబృందాలతో జరిపే చర్చలు ఆహ్లాదకరంగా సాగుతాయి. అన్యభాషలు నేర్చుకోవాలనే ఆలోచనలు మెదులుతాయి.

**తుల:** స్వయం ఉపాధిపథకాలకు గాను ప్రభుత్వ సహాయం లభిస్తుంది. ప్రజా సంబంధాలు విస్తృత పరచుకోగలుగుతారు.

**వృశ్చికం:** ఆలోచనలు మెరుగైనవే అయినప్పటికీ పనులలో జాప్యం ఏర్పడుతుంది. వాహన సౌఖ్యం.

**ధనుస్సు:** సమాజంలోని ఉన్నత స్థాయి వర్గం వారు కూడా మీ సలహాలను స్వీకరిస్తారు. నూతన వస్తుకొనుగోలు.

**మకరం:** ఒక సందర్భంలో మానసికోద్రేకాన్ని కలిగి ఉంటారు. మంచి అవకాశాలు లభిస్తాయి.

**కుంభం:** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పే వారు అధికమవుతారు. ఇతరులకు అనాలోచితంగా వాగ్దానాలు చేయవద్దు.

**మీనం:** వ్యక్తిగత విషయాలకన్నా, వృత్తి ఉద్యోగాలకు ప్రాముఖ్యత నిస్తారు. ఇతరులు చెప్పేది ఓర్పుగా వింటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సూపర్ ఎల్‌నినో యమ డేంజర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** భూమి మునుపెన్నడూ లేని విధంగా నెమ్మదిగా ఒక ప్రాణాంతక వేడి ఉచ్చులోకి జారుకుంటోంది. ఈ సంక్షోభం గురించి క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ ఒక దిగ్భ్రాంతికరమైన సమాచారాన్ని విడుదల చేసింది. ప్రస్తుత ఎల్‌నినో బలపడే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచాన్ని మరింత వేడెక్కిస్తున్న వేళ.. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఈ సూపర్ ఎల్ నినో వాతావరణ మార్పు, రాబోయే నెలల్లో ప్రపంచాన్ని మండే కొలిమిగా మార్చబోతోంది. అధిక ఉష్ణోగ్రతలు బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. బలమైన ఎల్‌నినో కారణంగా రాబోయే 6 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల అదనపు వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అధ్యయనం అంచనా వేసింది. ఇందులో భారత్‌లో సుమారు 15,800 అదనపు వేడి సంబంధిత మరణాలు ఉండొచ్చని పేర్కొంది. ఇవి ఇప్పటికే నమోదైన మరణాలు కాకుండా ఉష్ణోగ్రతల అంచనాలు, గత మరణాల గణాంకాల ఆధారంగా రూపొందించినట్లు క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పేర్కొంది.

**1.2 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు:**

క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అధ్యయనం ప్రకారం సెప్టెంబరు 2026 నుంచి ఫిబ్రవరి 2027 మధ్య ప్రపంచ భూభాగ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయితో పోలిస్తే సగటున 1.2 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. సాధారణ సంవత్సరంతో పోలిస్తే అత్యంత వేడి రోజులు కూడా సుమారు 44శాతం ఎక్కువగా ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు. ఈ పరిస్థితులు భవిష్యత్తులో వాతావరణ మార్పుల కారణంగా ఎదురయ్యే అధిక ఉష్ణోగ్రతలకు ఒక ముందస్తు సంకేతంలా ఉండొచ్చని అధ్యయనం పేర్కొంది.

**భారత్‌పైనా తీవ్ర ప్రభావం:**

భారత్‌లో అంచనా వేసిన 15,800 అదనపు మరణాల్లో దాదాపు సగం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యే సంభవించే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది. ఆ తర్వాత భారత్‌లో వేసవి కాలం ప్రారంభమయ్యే కొద్దీ వేడి ప్రభావం కొనసాగవచ్చని పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, ఇతర బలహీన వర్గాలపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఏ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం?:**

అధ్యయనం ప్రకారం, తక్కువ కార్బన్ ఉద్గారాలు కలిగిన అభివృద్ధి చెందుతున్న, వెనుక బడిన దేశాలు ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల ఎక్కువగా నష్టపోతాయి. ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతంలో సుమారు 66,800 అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఇందులో నైజీరియాలోనే 31,400, సూడాన్‌లో 17,500, నైజర్‌లో 10,000, చాద్‌లో 8,000గా అంచనా వేశారు. దక్షి ణ, ఆగ్నేయాసియాలోనూ గణనీయమైన ప్రభావం ఉంటుందని అంచనా. ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియాలో కలిపి 19,400, ఇండోనేషియాలో 19,300, బ్రెజిల్‌లో 13,300 అదనపు వేడి సంబంధిత మరణాలు ఉండొచ్చని అధ్యయనం పేర్కొంది.

**ముందస్తు చర్యలు తీసుకోవాలి:**

క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్, 1996 నుండి 2025 వరకు ఉన్న 30యేళ్ల సాధారణ సగటుతో పోల్చి ఈ హెచ్చరికను శాస్త్రీయంగా లెక్కించింది. ఈ నివేదిక ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు తక్షణ హెచ్చరిక గంటను మోగిస్తోంది. ప్రభుత్వాలు ప్రజలకు ముందుగానే వడదెబ్బ హెచ్చరికలు జారీ చేయాలి. వేడి హెచ్చరిక వ్యవస్థలు, శీతలీకరణ కేంద్రాలు, తాగునీటి సౌకర్యాలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు రక్షణ, బలహీన వర్గాలకు ఆరోగ్య అవగాహన, ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యల ద్వారా మరణాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని అధ్యయనం సూచించింది. ప్రభుత్వాలు ఇప్పుడు యుద్ధ తరహా చర్యలు తీసుకోకపోతే, ఈ భయంకరమైన వడగాలులు లక్షలాది మానవ ప్రాణాలను నిశ్శబ్దంగా బలి తీసుకుంటాయి. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు భవిష్యత్తులో వాతావరణ మార్పుల వల్ల సాధారణమయ్యే అధిక ఉష్ణోగ్రతలకు ఒక ముందస్తు సంకేతంలా పనిచేస్తున్నాయి. అందువల్ల తక్షణ అత్యవసర చర్యలతో పాటు దీర్ఘకాలికంగా వాతావరణ అనుకూలత, ఆరోగ్య వ్యవస్థలు, వేడి నుంచి రక్షణ కోసం పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందని అధ్యయనం సూచిస్తోంది.



బుధవారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కలిసి తమ పార్టీ నేతలపై జరిగిన దాడిని వివరిస్తున్న జగన్

# లోకేష్ రాజీనామా చేయాలి

## డిఎస్సీ2025పై సిబిఐ విచారణ జరిపించాలి

### 'శాప్ కార్యాలయం వద్ద దాడి ఘటనపై అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం

### మాజీ సిఎం జగన్, గవర్నర్‌తో భేటీ.. వినతిపత్రం అందజేత

**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ అక్రమాలకు పాల్పడిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. శాప్ కార్యాలయం వద్ద వైసిపి శ్రేణులపై దాడికి సంబంధించి ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే డిఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలతో గవర్నర్‌కు వినతి పత్రం అందించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం లోక్‌భవన్ వద్ద వైఎస్ జగన్ మాట్లాడారు. "గవర్నర్‌కు సెప్టెంబరు 21న జరిగిన ఘటనపైనే కాకుండా, ఏ విధంగా డిఎస్సీ స్కామ్‌లో యువత నష్టపోయింది అనేది వివరించాము. ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాలన్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డిఎస్సీ స్కామ్‌పై కచ్చితంగా సిబిఐ విచారణ జరగాలి. విద్యా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాల్సి అని జగన్ పునరుద్ఘాటించారు.

# ఎపి బిజెపి ఇన్‌చార్జ్‌గా అరవింద్ భదౌరియా

**హైదరాబాద్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** బిజెపి సంస్థాగతంగా మరోసారి మార్పులకు శ్రీకారం చుట్టింది. వచ్చే యేడాది ఎన్నికల జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలతో పాటు దక్షి ణాది సహా 28 రాష్ట్రాలకు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జులు, సహ ఇన్‌ఛార్జులను నియమించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియమాకాల్లో రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ సహా పలువురు తెలుగువారికి చోటు కల్పించింది. ఒడిశాకు ఇన్‌చార్జ్‌గా పురందేశ్వరి, డికె అరుణను తమిళనాడు సహ ఇంఛార్జ్‌గా నియమించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించగా ఆ రెండు రాష్ట్రాలకు సిద్ధార్థ్ శంభు కోఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. తెలంగాణతోపాటు పశ్చిమ బెంగాల్ పార్టీ వ్యవహారాల బాధ్యత లను సునీల్ బన్సల్‌కుఅప్పగించారు. తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమితు లయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు అరవింద్ భదౌరియా, కో-ఇన్‌చార్జ్‌గా వనతి శ్రీనివాసన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహ్ కోఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహ రించనున్నారు. దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షి ంచనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బిజెపి ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కోఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. అటు, కర్ణాటకకు హరీష్ ద్వివేది, డాక్టర్ కాసం వేంకటేశ్వర్లు, కేరళకు ప్రొఫెసర్ ఎం నాగరాజా, ఎం వేంకటేశన్ నియమితులయ్యారు. ఇక ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యాల్, దర్శనా జర్దోష్ కోఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. బిజెపి మరో ఉపాధ్యక్షుడైన రామ్‌మాధవ్‌కు ఉత్తరాఖండ్ బాధ్యతలు అప్పగించగా.. అరవింద్ మీనన్, బాన్సురీ స్వరాజ్ ఆయనకు అసోసియేట్స్‌గా నియమితులయ్యారు. ఈ జాబితాలో తమిళనాడు బాధ్యతలను రామ్ మాధవ్‌కు కాకుండా ఇతర నాయకులకూ అప్పగించారు. మరోవైపు పార్టీ కమ్యూనికేషన్ విభాగంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా విభాగం, సోషల్ మీడియా యూనిట్‌ను కలుపుకునే కమ్యూనికేషన్ విభాగానికి అనిల్ బలూని సమన్వయకర్త నియమితులయ్యారు. ఇటీవల నేషనల్ మీడియా విభాగం కోకన్వీనర్‌గా నియమితులైన ఆషిశ్ ఉషా అగర్వాల్‌కు కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

# టెక్కలిలో ఘోర ప్రమాదం

**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. టెక్కలి మండలం రావివలస జంక్షన్ బర్మా కాలనీ సమీపంలో బమ్మిడివాని కోనేరు వద్ద వేగంగా దూసుకొచ్చిన రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో నలుగురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఐదుగురు ఇంటర్ విద్యార్థులు టెక్కలి నుంచి నౌపడ వైపు ట్రాక్‌పై నడుచుకుని చేపలు పట్టడానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో అదే మార్గంలో అత్యంత వేగంగా దూసుకొచ్చిన రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖరావు, దిలీప్‌కుమార్, శివ, శరత్ అక్కడికక్కడే మృతి చెందగా, సాల్మన్‌రాజు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చేరాడు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు గాయపడిన వ్యక్తిని సమీపంలోని దమర ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన యువకుడిని స్థానికులు, పోలీసులు హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు, స్థానిక పోలీసు యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు కళ్లముందే విగతజీవులుగా మారడంతో దమర, రావివలస ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ప్రమాదంపై మంత్రి అచ్చెన్న తీవ్ర దిగ్భ్రాంతి :**

రావివలస వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నలుగురు యువకులు దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా రెవెన్యూ, పోలీసు, రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. మరణించిన నలుగురి కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల వివరాలను సేకరించి వారి కుటుంబ సభ్యులకు తక్షణ సమాచారం అందించాలని ఆదేశించారు.

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆరా:**

రైలు ప్రమాద ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలను రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన అధికార యంత్రాంగానికి సూచించారు. అలాగే మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రమాద ఘటనపై తీవ్ర ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారు.

# రైలు ఢీకొన్న ఘటనలో నలుగురి మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

**అమరావతి, సెప్టెంబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో రైలు ఢీకొని నలుగురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైలు ఢీకొని విశాఖరావు, దిలీప్ కుమార్, శివ, శరత్ కుమార్ అనే నలుగురు విద్యార్థులు మృతి చెందడం విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఘటనపై అధికారులను అడిగి సిఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. రైలు రాకను గమనించలేకపోవడంతో ప్రమాదం జరిగిందని అధికారులు వివరించారు. ప్రమాదంలో సాల్మన్‌రాజ్ అనే మరో విద్యార్థి గాయపడ్డారని, అతనికి ప్రస్తుతం టెక్కలి డీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు సిఎంకు తెలిపారు. సాల్మన్‌రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సిఎం సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, మద్దతుగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

24-9pg3exHMNWJQEBPGOLKTC.qxd:24-9pg3exHMNWJQEBPGOLKTC.qxd 1/1/02 6:30 AM Page 1



# వాయుగుండం.. జోరు వాన

**● ఉత్తర కోస్తాలో కుండపోత ● రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు ● లోతట్టు ప్రాంతాలు జలమయం ● అల్లూరు జిల్లాలో కొట్టుకుపోయిన కల్వర్టు ● 6 జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు**

**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావం తో రాష్ట్రంలో వర్షాలు ఆగకుండా కురుస్తున్నాయి. బుధవారం విజయవాడ నగరం రోజంతా వర్షం సన్నటి జల్లుగా ఎడతెరిపి లేకుండా కురుస్తుంది. గత రాత్రి ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లులు, లోతట్టు ప్రాంతంలో వర్షం నీరు చేరి పాదచారులకు, ద్విచక్రవాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. గుంటూరు, నెల్లూరు, విజయనగరం నగరాలపై వాన ప్రభావంతో జన జీవనానికి ఇబ్బంది కలిగింది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గంలో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో ఎడతెరిపిలేని వానలతో వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాన నీరు చేరింది. ఆమదాలవలస తహసీల్దార్ సత్యం నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో అల్లూరి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పాడేరు, అరకు లోయ మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జీకే వీధి మండలం సప్పర్ల పంచాయతీ చాట్రాయ పల్లి, తోకగరువులోనూ వానలు పడుతున్నాయి. జర్రెల నుంచి అసంపల్లి వెళ్లే రహదారి కొట్టుకు పోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తు జాగ్రత్తగా చాపరాయి జలపాతం మూసివేశారు. ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో కలెక్టర్ నిశాంతి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వానలతో పత్తి, మిర్చి, వరి పైర్లకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. విశాఖలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లాసెన్స్ బే కాలనీలో ఓ భారీ వృక్షం ఒక్కసారిగా నేలకూలింది. అదే సమయంలో అక్కడ పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంపై చెట్టు పడింది. చెట్టు కూలడంతో విద్యుత్ తీగలు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం చెట్టును తొలగించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా తేలికపాటి వర్షం కురుస్తోంది. కాకినాడ, పిఠాపురం, తుని పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

**అప్రమత్తమైన మంత్రులు, అధికారులు:** వర్షాల నేపథ్యంలో మంత్రులు అప్రమత్తమయ్యారు. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలపై ఇపిడిసిఎల్ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు కూలిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు చేపట్టాలని సూచించారు. మన్యం, అల్లూరి, పోలవరం ప్రాంతాల పరిస్థితిపై మంత్రి సంధ్యారాణి సమీక్షించారు. ఈదురుగాలులు, పిడుగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ప్రజలు చెట్ల కింద, గుట్టల సమీపం లో, హోర్డింగ్‌ల వద్ద నిలబడవద్దని హెచ్చరించారు. పిడుగుల ప్రమాదం దృష్ట్యా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంధ్యారాణి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని సూచించారు. వాగులు దాటే పరిస్థితి ఉంటే పాఠశాలలకు సెలవు ప్రకటించాలి సంధ్యారాణి తెలిపారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంత్రి నారాయణ అధికారులను పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే ప్రభావిత ప్రాంతాల మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా అదనపు సిబ్బందిని నియమించి నిరంతరం పర్యవేక్షి ంచాలని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. అమరావతి నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు.



# ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి

**● వర్షాలపై సిఎస్, డిజిపితో పాటు మంత్రులు, అధికారులతో సిఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష**

**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల ప్రభావం ఉన్న రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పర్యవేక్ష కొనసాగించాలన్నారు. రాష్ట్రానికి తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు యంత్రాంగాన్ని అలెర్ట్ చేశారు. వర్షాలపై సీఎస్, డీజీపీతో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులతో సీఎం అత్యవసర సమీక్ష నిర్వహించారు.

శ్రీకాకుళంకవిటి మధ్య తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందని, కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నదులు, వాగుల్లో వంకల్లో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించి లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని నిర్దేశించారు. 261 మండలాల్లో భారీ వర్షం, 121 మండలాల్లో సాధారణ వర్షం, 9 మండలాల్లో అతి భారీ వర్షం, 2 మండలాల్లో తీవ్ర వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఉత్తర కోస్తా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకల్లో ఆకస్మిక ప్రవాహాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు .అధికారిక సమాచారాన్ని అనుసరించి 261 మండలాల్లో వర్షాలపై ప్రత్యేక అంచనాలు ఉన్నందున రేపు, ఎల్లుండి కూడా అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆకస్మిక వరదలు, భారీ వర్షాలకు అవకాశం ఉండే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. నదుల్లో ప్రవాహాలను ఎప్పటికప్పుడు మానిటర్ చేసి రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

# అప్రమత్తంగా వ్యవహరించాలి

**● ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి ● అవసరమైన చోట పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలి ● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం**

**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తుపాను హెచ్చరికలు, భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరికలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా కల్వర్టులు దెబ్బతినడం, గ్రామీణ రహదారులు తెగిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్దేశం చేశారు. ఎక్కడైనా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. వరదల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట నిర్వహించే పునరావాస కేంద్రాలలో పాలు పంచుకోవాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస శిబిరాల్లో ఆహారం, రక్షిత మంచినీరు, మందులు, ఇతర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. వర్షాలు, వరదల కారణంగా పశువులు, ఇతర మూగజీవాలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాటికి అవసరమైన మేత, నీటి ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని సూచించారు. విపత్తు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక తదితర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# భారీ వర్షాలు.. స్తంభించిన జనజీవనం



**నరసాపురం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నెమ్మదిగా ప్రారంభమైన వర్షం క్రమంగా జోరందుకోవడం తోపాటు ఈదురు గాలులు వీయడంతో జన జీవనం స్తంభించింది. బుధవారం రాత్రికి వర్షం మరింత ఉధృతమైంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం ఇదే తొలిసారిగా కనిపిస్తోంది. ఏలూరు జిల్లాలోని కొయ్యలగూడెం, పోలవరం, నూజివీడు ప్రాంతాల్లో 60 నుంచి 80 మిల్లీ మీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో సైతం సుమారు 80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సుమారు సగం మండలాల్లో వర్షం, ఈదురు గాలుల ప్రభావం అధికంగా ఉండగా, మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**పంటలకు ఊరట:** కొంతకాలంగా తీవ్ర ఎండలు, వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రస్తుత వర్షాలు ఊరటనిస్తున్నాయి. ముఖ్యంగా వరి, కొబ్బరి, ఆక్వా రంగాలకు ఈ వర్షాలు ప్రయోజనకరంగా మారాయి. వర్షాలు లేకపోవడంతో వరి పైరుకు పొడ తెగులు పెరగడంతోపాటు కాలువల శివారు భూముల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ఉద్యాన పంటలు సైతం వర్షాభావంతో దెబ్బతిన్నాయి.

**ఆక్వా రంగానికీ ప్రయోజనం:** చేపల చెరువుల్లో తెగుళ్ల పెరగడంతో చేపల ఎదుగుదల మందగించిన పరిస్థితుల్లో వరుస వర్షాలు కొంత ఉపశమనం కలిగించాయి. మామిడి, సరుగుడు తోటలకు గత నాలుగైదు నెలలుగా నీటి కొరత ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత వర్షాలతో ఆయా పంటలకు కూడా కొంత ఊరట లభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్రంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు ప్రస్తుత వర్షాలు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ నీటి కొరత ప్రారంభమైన నేపథ్యంలో ఈ వర్షాలు పరిస్థితిని మెరుగుపరుస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగితే పొడి వాతావరణం, తీవ్ర ఎండల నుంచి మరింత ఉపశమనం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

# శృంగేరి, ఆగుంబే ప్రాంతాల్లో భారీ వర్షాలు

**● శృంగేరి వద్ద తుంగా నదిలో 25 వేల క్యూసెక్కుల ప్రవాహం ● రానున్న రెండు రోజుల్లో తుంగభద్రకు 35-50 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం**

**అనంతపురం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు అయిన కర్ణాటక రాష్ట్రంలో ఉన్న తుంగభద్ర జలాశయానికి పై భాగంలో మంగళవారం రాత్రి, బుధ వారం భారీ వర్షాలు పడడంతో రాబోయే రెండు మూడు రోజుల్లో జలాశయానికి భారీగా ఇన్ఫ్లవ్స్ వచ్చే అవకాశం కనిపి స్తోంది. గత వారం రోజులుగా తుంగభద్ర జలాశయానికి పైభాగంలో ఉన్న తుంగ, భద్ర నదుల నుంచి నీరు రావడం ఆగిపోయింది. వచ్చే నీరు ఆగిపోగా బయటకు వదిలే నీరు ఎక్కువగా ఉంటూ వచ్చింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నీటి కోసం జగడాలు జరుగుతున్న నేపథ్యంలో తుంగభద్ర జలాశయం పై భాగంలో శృంగేరి, అగుంబే, తీర్థహళ్లి ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడంతో రైతులకు శుభవార్తగా కనిపిస్తోంది. తుంగభద్ర జలాశయానికి పై భాగంలో తుంగభద్ర నదికి ఉపనదులుగా తుంగ, భద్ర నదులు ఉన్నాయి. తుంగ నది ఉన్న శృంగేరి, ఆగుంబే పరిసర ప్రాంతాల్లో సుమారు 15 నుంచి 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో శృంగేరి దేవాలయం వద్ద తుంగ నదిలో 25,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైనట్లు సమాచారం. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో ఇదే స్థాయిలో వర్షాలు కొనసాగితే రానున్న రెండు రోజుల్లో తుంగభద్ర నదికి 35,000 నుంచి 50,000 క్యూసెక్కుల వరద నీరు చేరే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తుంగా, భద్ర నదుల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



శృంగేరి, ఆగుంబే ప్రాంతాల్లో వర్షం పడుతున దృశ్యం

**శ్రీశైలానికి పెరగనున్న వరద ప్రవాహం?:** కర్ణాటక, మహారాష్ట్రల్లోని కృష్ణా, తుంగభద్ర ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉంది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగి, ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి విడుదలలు పెరిగితే శ్రీశైలం నీటిమట్టం వేగంగా పెరిగే అవకాశం ఉంది. ఎగువ ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ, వరద ప్రవాహం తీవ్రతను బట్టి శ్రీశైలం మళ్లీ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరే పరిస్థితులు ఏర్పడవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# అధికారులు అప్రమత్తంగా ఉండండి: ఏలూరు జిల్లా కలెక్టర్

**ఏలూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. వాయుగుండం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో బుధవారం సాయంత్రం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు చర్యలపై సమీక్షి ంచారు. భద్రాచలం నుంచి గోదావరిలోకి భారీగా వరదనీరు వచ్చే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైతే ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది, వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, వర్షాలు, వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వరద ప్రభావిత మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు.



# అక్టోబర్‌లోనే స్థానిక ఎన్నికలు

**● కూటమి క్లీన్ స్వీప్ చేయాలి ● మంత్రులతో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో స్పష్టీకరణ**

**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దు. కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించు కోవాలన్నారు.. అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించాలన్నారు. ఆ దిశలో టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ముందు మంత్రులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడు తుండటం శుభపరిణామం. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా సమన్వయం చేసుకోవాలి. జలాశయాలు నింపుకునేందుకు మంచి అవకాశం. స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పనిచేయవు. పొత్తుల అంశం సమన్వయ కమిటీ, అధిష్ఠానం నిర్ణయిస్తుంది. విద్యాశాఖ లక్ష్యంగా ప్రత్యర్థుల కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి. టీచర్లపై దాడుల ఘటనలో కేసులు పెట్టగానే నిందితుల పరారీ.



టీచర్లపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని" మంత్రి లోకేష్ పేర్కొన్నారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతోపాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని లోకేష్ సూచించారు. గురువులపై గూండాలతో దాడులు చేయించే దుశ్చర్యకు గొడ్డలిపార్టీ పాల్పడిందని మండిపడ్డారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చి దాడులకు తెగపడి మీసాలు మెలేసినవారు.. పోలీసులు చట్టప్రకారం కేసులు పెట్టగానే పరారీలో ఉన్నారన్నారు. టీచర్లను కించపరుస్తూ ఎవరైనా దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అధికారంలో ఉండి చేసిన అక్రమాలపై ఆధారాలతో ఒక్కో కుంభకోణం బయటకు వస్తుంటే, ఓర్వలేకే డైవర్ట్ రాజకీయాల కోసం నిరుద్యోగులకు మేలు చేసిన డిఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డిప్యూటీ సిఎం పవన్‌కు చంద్రబాబు ఆత్మీయ పరామర్శ

**● చికిత్సలో ఉండి కుడా అభివృద్ధి పనులపై సమీక్షలు చేయడంపై ప్రశంసలు ● కుడిభుజానికి చికిత్స అనంతరం తొలిసారి కేబినెట్ భేటీకి డి.సిఎం హాజరు**

**అమరావతి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళంలో ఆయుర్వేద చికిత్స ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయ స్వాగతం పలికారు. సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి హాజరైన పవన్‌ను సిఎం ప్రత్యేకంగా పలకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ యోగక్షేమాలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ తీవ్రమైన భుజం నొప్పితో బాధపడుతున్నారు. దీని నుంచి ఉపశమనం పొందేందుకు ఆయన ఇటీవల కేరళం వెళ్లారు. కొన్ని వారాల పాటు కేరళలోని ప్రముఖ డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రిట్రీట్‌లో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకున్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో పాలనా వ్యవహారాలపై దృష్టి సారించి మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు.



పవన్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న సిఎం, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వైద్యానికి సంబంధించిన వివరాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకుని, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావడం పట్ల డిప్యూటీ సిఎంను చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. కేరళంలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పవన్ తన బాధ్యతలను ఏమాత్రం విస్మరించలేదని గుర్తుచేశారు. అక్కడి నుంచే తన శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించడాన్ని సిఎం కొనియాడారు. ప్రజా సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఉన్న చిత్తశుద్ధికి, విధుల పట్ల ఆయన కనబరుస్తున్న అంకితభావానికి ఇదే నిదర్శనమని చంద్రబాబు ప్రశంసించారు.

# తుఫాను తీరం దాటే వరకు అలసత్వం వద్దు

**● అధికారులు రక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలి ● ప్రజలు అధికారుల సూచనలు పాటించాలి ● రెడ్ అలర్ట్ తొలగించే వరకు మత్స్యకారులు చేపల వేటకెళ్లవద్దు ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**విజయనగరం, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** తుఫాను తీరం దాటే వరకు జిల్లా ప్రజలంతా అలసత్వం లేకుండా అధికారుల సూచనలు పాటించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గురువారం కూడా ఈదురు గాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారుల ఆదేశాలను తూ.చా తప్పకుండా పాటించాలన్నారు. గత రెండు రోజులుగా జిల్లా అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ మండల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయగలిగారన్నారు. వాయుగుండం తీరం దాటే సమయంలో భారీ ఈదురుగాలులు వచ్చే అవకాశాలు ఉన్నందున చెట్ల కింద కారు బయట ప్రదేశాలలో ఉండవద్దని మంత్రి కొండపల్లి కోరారు. అత్యవసరమైతేనే ప్రయాణాలు కొనసాగించాలని లేదంటే వాయిదా వేసుకోవటం మంచిదన్నారు. మానవ ప్రాణాలతో పాటు, పశువుల ప్రాణాలను కూడా కాపాడవలసిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, యువ నాయకులు మానవ వనరుల శాఖ మాత్యులు నారా లోకేష్ గారు తుఫాను ప్రభావం పై గంట గంటకు అధికారుల నుండి నివేదికలను తీసుకుని రక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగులు నిండటంతో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తున్న కారణంగా కొన్ని రహదారులలో రాకపోకలను నిషేధిస్తూ అధికారుల ప్రమాద హెచ్చరిక సూచనలు ఏర్పాటు చేశారని వాహనదారులు హెచ్చరికలను పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను వరద ప్రవాహాల వద్దకు తీసుకు వెళ్ళవద్దని, చెరువుల వద్దకు వాగులు వద్దకు వెళ్లకుండా చూడాలని మంత్రి సూచించారు. అలాగే సముద్రంలో ప్రమాద హెచ్చరికలు, రెడ్ అలర్ట్ తొలగించే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. తుఫాను ప్రభావం తగ్గేవరకు జాగ్రత్తలు పాటించాలని ప్రజలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.



# భోగాపురం నుంచి ఢిల్లీకి నేరుగా విమాన సర్వీసులు

**విజయనగరం (భోగాపురం) సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** విమానాశ్రయం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్ నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనుండటం సంతోషకరంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఢిల్లీ ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు, ప్రయాణికు లకు మరింత ఎంపిక, సౌకర్యాన్ని ఈ కొత్త విమాన సర్వీసు అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అక్టోబర్ 25వ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రారంభం కానుండగా ఉదయం 5:55కు ఢిల్లీలో ప్రారంభమై 8:20కి భోగాపురం చేరుకోనుంది. మళ్ళీ భోగాపురం లో 09:05నిమిషాలకు ప్రారంభమై 11:30కు ఢిల్లీ చేరుకుంటుంది. భోగాపురం విమానా శ్రయం ద్వారా దేశంలోని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ మరింత విస్తరించడంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటకం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని రామ్మోహన్ తెలిపారు. ఆకాశ ఎయిర్ తిరిగి విశాఖపట్నం ప్రాంతంలో తన విమాన సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Anjaneya & Eswara Swamy Temple
Gulyapalyam (V) Vajrakarur (M) Ananthapur District
e-procurement Tender
NIT.NO.P/COE/1479/2026 Dt: 29-07-2026
e-Tenders are invited through the e-procurement portal for Renovation of Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria and Submission guidelines.
Executive Officer

24-9Pg8exHMNWJQE.qxd:24-9Pg8exHMNWJQE.qxd 1/1/02 6:42 AM Page 1



# డిజె శబ్దంతో మృత్యుఘంటికలు

- 150 డిబిల శబ్దంతో గుండెపోటు
- కనీసం డిజెకి వంద మీటర్ల దూరంలో ఉండాలి

**(ప్రభాతవార్త నెట్‌వర్క్) :** ఒకప్పుడు పండగలు, ఉత్సవాలు, జాతరలు వస్తే ఆనందానికి అంతు ఉండేది కాదు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకునేవారు. అయితే డిజె వచ్చిన తరువాత పరిస్థితులు తారుమారు అయ్యాయి. కొన్ని సందర్భాల్లో డిజె మోతకు కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరికొందరు శాశ్వత వినికిడి సమస్యను, ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అసలు డిజె వల్ల కలిగే సమస్యలపై దృష్టి సారిద్దాం. డిజె శబ్దాన్ని ఒక నిర్దిష్ట డెసిబిల్స్(డిబి) వరకు మాత్రమే కర్ణభేరి తట్టుకుంటుంది. శబ్దం ఎక్కువ అయ్యే కొలదీ రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. మెదడులో నరాలకు తీవ్ర వత్తిడికి గురౌతాయి. కండరాలు తీవ్రస్థాయిలో కదలికలను వ్యక్తం చేస్తుంది. దీనితో డిజెకి అతి దగ్గరగా ఎక్కువ సమయం నిలబడిన వ్యక్తి క్రమంగా ఉద్వేగానికి గురై పడిపోతాడు. శరీరంలో అనేక సమస్యలు తలెత్తుతాయి. కొన్ని అవయవాలు త్వరగానే పూర్వ స్థితికి వస్తాయి. కొన్ని మాత్రం శాశ్వతంగా పనిచేయడం మాని వేస్తాయి. దీనితో వైకల్యం కాని. ప్రాణహానీ కాని కలుగుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ శబ్దాన్ని భరించే శక్తి వయస్సు, లింగబేధం, ఆరోగ్య సమస్యలపై అధారపడి ఉంటుంది. అంతే కాకుండా ఎంతసేపటి నుంచి వింటున్నారన్న అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా 85 డిబికి పైగా ఎక్కువసేపు ఉంటే వినికిడి నష్టం ప్రమాదం స్థాయిపెరుగుతుంది.
100-110 డిబిలు కొన్ని నిమిషాల్లోనే చెవికి హాని కలగవచ్చు. ఇక 120 డిబి పైగా వింటే చెవిలో నొప్పి/తీవ్ర అసౌకర్యం కలగవచ్చు. అకస్మాత్తుగా వ చ్చే చాలా పెద్ద శబ్దం తక్షణ నష్టాన్ని కలిగించవచ్చు. 140 డిబి దగ్గర లేదా అంతకంటే ఎక్కువ శబ్దం ఉంటే కర్ణభేరి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా కర్ణభేరి పగలకపోయినా, డిజె శబ్దం లోపలి చెవిలోని సున్నితమైన హెయిర్ సెల్స్‌ను దెబ్బతీసి శాశ్వత వినికిడి లోపం లేదా చెవుల్లో మోత శబ్దం కొన్ని రోజులవరకు కలిగించవచ్చు. మరికొందరికి చికిత్స తీసుకున్నా ఇది జీవితాంతం ఉండే ప్రమాదం కూడా ఉంది. డిజెలో వచ్చే అధిక శబ్దం వల్ల ఆరోగ్యంపై ప్రభావం ప్రధానంగా శబ్ద తీవ్రత, ఎంతసేపు వింటున్నారు, స్పీకర్‌కు ఎంత దగ్గరగా ఉన్నారు అనే విషయాలపై ఆధారపడి ఉంటుంది.

### డిజె శబ్దం వల్ల వచ్చే సమస్యలు

**వినికిడి తగ్గడం:** ఎక్కువ శబ్దానికి పదేపదే గురైతే శాశ్వత వినికిడి సమస్య రావచ్చు.
**కర్ణభేరి దెబ్బతినడం:** చాలా పెద్ద శబ్దం వల్ల కర్ణభేరికి గాయం లేదా అరుదుగా చీలిక కూడా సంభవించవచ్చు.
**చెవుల్లో మోతగ్రింగిరాలు :** డిజె తర్వాత చెవుల్లో గంటలు మోగుతున్నట్లు అనిపించడం ఒక హెచ్చరిక. చెవి నొప్పి, చెవులు మూసుకుపోయినట్లు అనిపించడం.
తలనొప్పి, తల తిరగడం, అలసట.
**నిద్రకు ఆటంకం:** ముఖ్యంగా రాత్రి వేళ ఎక్కువ శబ్దం వల్ల.ఒత్తిడి, చిరాకుతో అలసట కారణంగా రోగనిరోధక శక్తి తగ్గుతుందిగుండెపై ప్రభావం: అధిక శబ్దం వల్ల శరీరంలో విపరీతమైన వత్తిడి పెరిగి గుండె వేగం, రక్తపోటులో తాత్కాలిక మార్పులు రావచ్చు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్త వహించాలి.

### ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది

డిజె దగ్గర నిలబడి మాట్లాడటానికి కూడా గట్టిగా అరవాల్సి వస్తే, మీరు చాలా ఎక్కువ శబ్దానికి గురవుతున్నారని భావించాలి. వీలైనంత దూరంగా ఉండండి, డిజెకి సాధ్యమైనంత దూరం వెళ్లండి. లేదా హియరింగ్ ప్రొటెక్షన్ పరికరాలు ఉపయోగించండి.
అవును చాలా పెద్ద శబ్దంతో కూడిన డిజె/ లౌడ్ మ్యూజిక్ గుండెపై ప్రభావం చూపే అవకాశం ఉంది, కానీ డిజె శబ్దం వల్ల వెంటనే గుండెపోటు వస్తుంది" అని సాధారణంగా చెప్పలేం. అయితే అధిక శబ్దం శరీరంలో రక్తప్రసరణను పెంచి గుండె వేగం, రక్తపోటు వంటి వాటిలో అనూహ్యమైన మార్పులు కలిగించవచ్చు. దీర్ఘకాలికంగా అధిక శబ్దానికి గురికావడం కావడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ముఖ్యంగా రోగగ్రస్తులు మరియు అధిక రక్తపోటు సమస్య ఉన్నవారికి ప్రాణాపాయం కలిగే ప్రమాదం ఉంది. ఈ కారణంగా ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు అధిక రక్తపోటు ఉన్నవారు వృద్ధులు డిజె స్పీకర్లకు చాలా దగ్గరగా ఎక్కువసేపు ఉండకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# ఇంద్రకీలాద్రిపై లడ్డూ ప్రసాదం ఏటీఎం ప్రారంభం

- రాష్ట్రంలోనే తొలిసారిగా భక్తులకు సరికొత్త సేవలు
- హుండీ ఆదాయం రూ.2.08కోట్లు



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) కొండ దిగువన, అర్జునవీధి ప్రారంభంలోని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదం ఎటిఎంను దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ బుధవారం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ దర్శనార్థం విచ్చేసే భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా త్వరితగతిన లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌గా ఏర్పాటు చేసామని ఈ పైలట్ ప్రాజెక్ట్ పనితీరును పరిశీలించిన అనంతరం, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. ఫేక్ పూజా టికెట్లపై అప్రమత్తం **దళారులను నమ్మి మోసపోవద్దు:** దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయా న్ని ఉపేక్షించేది లేదని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
**సామాన్య భక్తులకే అగ్రతాంబూలం:** ఇంద్రకీలాద్రిపై రాబోయే దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు.
**హుండీ లెక్కింపు:** దుర్గమ్మకి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు బుధవారం లెక్కించగా రు.2కోట్ల 8 లక్షల 91వేల 285 నగదు, 203 గ్రాముల బంగారం, 2కెజిల 674 గ్రాముల వెండి, విదేశీ నగదు యుఎస్ఎ డాలర్స్ 192, మలేషియా రింగెట్స్ 16, యుఎఇ దిర్హమ్స్ 400, ఈజిప్ట్ పౌండ్స్ 20, యూరోలు 10, ఇంగ్లాండ్ పౌండ్స్ 80, 1.5 ఒమన్ రియల్స్, 5 సౌదీరియాల్స్, 12 కతార్ రియాల్స్, 300 ఒమన్ బైంసా, 115 కెనడా డాలర్స్, 20 ఆస్ట్రేలియా డాలర్స్ లభించినట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

# బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న విద్యార్థికి మంత్రి అభినందనలు

**అమరావతి, సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. ఈ నెల 9,13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధిం చి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్‌ఘడ్ లో జరిగే జాతీ య సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యా డ్మింటన్‌లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయి కుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అంద జేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తు లో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రా నికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# స్థానిక పోరులో కూటమి ప్రభంజనం ఖాయం

- పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** స్థానిక పోరులో కూటమి ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో బుధవారం కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మొదటగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, 28 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచేలా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడగవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు, సీనియర్ నాయకుల సూచనల మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అందరికీ ఒకేసారి అవకాశాలు ఇవ్వడం సాధ్యం కాదని అందరికీ తెలుసని, పోటీలో ఎవరు నిలబడ్డా పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ ఒక్కటై పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యలను విన్న వెంటనే పరిష్కరించాలి

- పిఠాపురం ప్రజా వినతులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణ స్పందన



**విజయవాడ, సెప్టెంబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా సమస్యలను విన్న వెంటనే పరిష్కారించాలని డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. పిఠాపురం నియోజకవర్గం పర్యటన సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను బుధవారం తన కార్యాలయంలో స్వయంగా పరిశీలించిన పవన్ కల్యాణ్ తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా, మానవతా దృక్పథంతో పని చేయాలని స్పష్టం చేశారు.

# విజయవాడ భవానీపురంలో డూండి గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నారా లోకేష్



**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ రాజధాని నగరం విజయవాడ భవానీపురంలో డూండి గణేష సేవా సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వ హిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ హితంగా రూపొందించిన 72 అడుగుల శ్రీ పంచముఖ వరసిద్ధి మహా గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహా గణపతి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సం దర్భంగా వేదపండితులు మంత్రికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కమిటీ సభ్యులతో మంత్రి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డూండి గణేష సేవా సమితి వ్యవస్థాపకులు డూండి రాకేష్, ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, డూండి గణేష సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోనలో శ్రీవారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



**రాపూరు (నెల్లూరు), సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి పవిత్రోత్సవములకు బుధ వారం సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో బాగంగా అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనం, మృత్సంగ్రహణం, నిర్వహించారు. స్వామి వారి ఉద్యానవనం నుండి పుట్టమన్ను సేకరించి స్వామి వారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తం గా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులకు పలురకాలైన ద్రవ్యాలు,పంచామృతాలు, పండ్ల రసాలతో స్నపన తిరుమం జనం(అభిషేకం) నిర్వహించారు. పవిత్రముల ప్రతిష్ట, ఆధివాస హోమం, ఉభయ దేవేరులతో నృసింహ స్వామి వారిని తిరుచ్చి పల్లకిపై స్వామి వారి ఆలయము నుం డి యాగశాల మండపం వద్దకు ప్రధానార్చకులు, అర్చకులు, వేదపండితులు మంత్రోచ్ఛరణలతో మంగళ వాయిద్యముల నడుమ వేంచేపు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి వారి పవిత్రోత్సవాల అంకురార్పణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ ఇఒ జనార్ధన్ రెడ్డి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, రవి స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, మోక్షజ్ఞ స్వామి, వేదపండితులు త్రినాథ్ స్వామి, సాయి స్వామి, నాగరాజు స్వామి, తిరుమల వేదశాస్త్ర పాఠశాల ఆచార్యులు, పలువురు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్‌లో డబ్బు చెల్లించినవారికి మొదటి విడతలో న్యాయం

- రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రినాదెండ్ల మనోహర్



**అమరావతి,సెప్టెంబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** అగ్రిగోల్డ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధి తులకు సత్వర న్యాయం కల్పించేలా, వెనువెంటనే మంత్రుల సబ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని రాష్ట్ర ఆహార పౌరసర ఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ వారంలో రెండోసారి అగ్రిగోల్డ్ సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు. బుధవారం సచివాలయంలో అగ్రిగోల్డ్ పై మంత్రుల సబ్ కమిటీతో స్టేట్ లెవెల్ కమిటీ సమావేశం జరిగింది. సీసీఎల్ఏ తో పాటు పోలీస్, మున్సిపల్, అటవీ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్లు శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ పరిస్థితి, ప్రస్తుతం ఉన్న పరిస్థితి ని సమీక్ష చేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడు తూ..ఈసారి అన్ని శాఖలను సమన్వయంతో స్టేట్ లెవెల్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిం చేందుకు వీలైన దారులను వెతుకుతున్నామని మంత్రుల సబ్ కమిటీ సభ్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. "అగ్రిగోల్డ్‌లో పెట్టుబడి పెట్టి బాండ్స్ ఉన్నవారు వారి ఒరిజినల్‌ను చూపించి జిరాక్స్‌ను ప్రత్యేక బృందాలకు ఇవ్వాలి. వాటిని ప్రత్యేక బృందాలు అటెస్ట్ చేస్తాయి. మొత్తం 20 ప్రత్యేక బృందాలను దీనికోసం నియమించాం. ఆంధ్రప్రదేశ్లో 7 తెలంగాణలో 3తో పాటు ఇతర రాష్ట్రాల్లో మరో 10 బృందాలు ఈ బాండ్ల సేకరణకు రెండు, మూడు రోజుల్లో క్షేత్ర స్థాయిలో పనిచేస్తాయి. అగ్రిగోల్డ్ గతంలో సేకరించిన భూముల్లో గతంలో ప్లాం టేషన్ జరిగింది. రకరకాల మొక్క లను వేశారు. దీనిపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక నోడల్ అధికారిని నియ మించి, ప్లాంటేషన్ మొత్తాన్ని ఆడిట్ చేయనున్నారు. అక్కడున్న వృక్ష సంపద అసలు విలువను లెక్క కడతారు. దీంతోపాటు అగ్రిగోల్డ్ మున్సిపల్ ఏరియాల్లో వేసిన లే అవుట్ల పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు మున్సి పల్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.అగ్రిగోల్డ్ ప్లాట్లను కొని, రిజిస్ట్రేషన్ చేసుకున్న బోనోఫైడ్ ( ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్లు పూర్తయినవారు ) లబ్ధిదారులకు మొదటి దశలో పూర్తిగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ భూములు 22ఏ లో ఉన్నాయి. వాటిని నిషేధిత భూములు నుంచి తొలగించి, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చూసేలా జిల్లాల కలెక్టర్లతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నాం.మొత్తం 42,531మంది ప్లాట్ల లబ్ధిదారుల్లో 35,544 మంది బోనోఫైడ్ లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించాం. 6,989 మంది డబ్బులు పూర్తిస్థాయిలో చెల్లించారు గాని రిజిస్ట్రేషన్లు జరగలేదు. వారికి రెండో విడతలో న్యాయం జరిగేలా చూస్తాం. ఇక మీద అగ్రిగోల్డ్ మీద సబ్ కమిటీ సమావే శాలు వేగవంతంగా ఉంటాయి. కమిటీ సమావేశాల్లో తీసుకుని నిర్ణయాలు వేగంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటాం. అగ్రిగోల్డ్ విషయంలో నష్టపోయిన ప్రతి లబ్ధిదారుడికి కచ్చితంగా న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం" అన్నారు.

# రైతులకు భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**తోటపల్లిగూడూరు (నెల్లూరు), సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండల కేంద్రంలో బుధవారం మండల ప్రధాన కార్యదర్శులు మన్నెం జితేంద్ర గౌడ్, మన్నెం మధుసూదన్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు పూర్తిస్థాయిలో మేలు చేయడంతో పాటు భూమిపై సర్వహక్కులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా నుకూల పాలన అందిస్తోందన్నారు. తోటపల్లిగూడూరు మండలంలో మొత్తం 6,094 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాల్సి ఉండగా ఇప్పటికే 4,605 మందికి పంపిణీ చేశామని తెలిపారు. సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న మరో 1,489 మంది రైతులకు త్వరలోనే పాసుపుస్తకాలు అందజేస్తామని చెప్పారు. రీసర్వే ప్రక్రియ ద్వారా రైతులకు భూ హక్కుల విషయంలో మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు, కెనాల్ ఛైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మి సురేంద్ర, విజయ డైరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులురెడ్డి, కోడూరు చినబాబురెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసులు, పెదూరు సొసైటీ ఛైర్మన్ గూడూరు నారాయణ, జనసేన నేతలు రాయపు పవన్‌కుమార్, మొగలిగుంట పోతన, తోటపల్లిగూడూరు టీడీపీ నేత రామ్మోహన్ నాయుడు, మాగుంట రమణారెడ్డి, ఆములూరు వెంకయ్య నాయుడు, కోడూరు నీటి సంఘం అధ్యక్షులు బాబు నాయుడు, అనిల్ చౌదరి, తాళ్లూరు జీవరత్నం, తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల శ్రీహరి, సొసైటీ డైరెక్టర్ మూగ రాజ, తుళ్లూరు ధనుంజయ్, చింతా సుమన్, గంగపట్నం సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# జనవరి1 నుంచి సంజీవని ప్రాజెక్టు

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ.సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా వచ్చేజనవరి1 నుంచి సంజీవని ప్రాజెక్టును అమలు చేసేందుకు అవసరమైన ముందస్తు చర్యల్ని వేగవంతం చేసినట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్ల దగ్గర నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు సంజీవని అమలు కోసం సన్నద్ధమవుతున్నారని చెప్పారు. 28 జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఒక సీనియర్ వైద్యులు లేదా అధికారిని సమన్వయకర్తగా నియమించామని చెప్పారు. శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్ణీత వ్యవధిలో నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగానే 104 వాహనాల్ని (ఆరోగ్య రథాలు) కూడా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లాల అధికారులు, బోధానాసుపత్రుల సూపరింటెండెంట్లు, వివిధ హోదాలో ఉన్న అధికారులతో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్, ఆరోగ్య కు టుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు బుధవారం హైబ్రిడ్ సమావేశాన్ని నిర్వహించారు. సంజీవని అమలుకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై కార్యదర్శి వీరపాండియన్ , కమీషనర్ చక్రధర్‌బాబు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు. ఇదే సమయంలో 104 వాహనాలను సంజీవని ద్వారా జరిగే పరీక్షలకు అనుకూలంగా సిద్ధం చేయడంపై వారి మధ్య చర్చ జరిగింది. సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిం చిన విధంగా జనవరి 1 నుంచి సంజీవని ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించేందుకు వీలుగా పకడ్బందిగా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

# బేబీ కిట్లకు యేటా రూ. 51.15 కోట్ల మంజూరు

- మంత్రి సత్యకుమార్ యాదవ్
- 2.45 లక్షల మంది శిశువులకు ఉపయోగం

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లుల శిశువులకు ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం తిరిగి అమలు చేస్తోంది. ఎన్టీఆర్ బేబీ కిట్లతో శిశువులకు అవసరమైన ప్రాథమిక సంరక్షణ వస్తువులు అందుబాటు లోకి వస్తాయి. శిశువుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతను కాపాడటంలో ఇవి ఉపయోగపడతాయి.. ఇందుకు సంబం ధించిన జీవోను బుధవారం ఎవైద్య, ఆరోగ్యశాఖ జారీచేసిం ది. ఇక బేబీ కిట్లును అందించేందుకు ఏటా రూ.51.15 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏటా సుమారు 2.45 లక్షల ప్రసవాలు జరుగుతున్నాయని, ఒక్కో కిట్ ధర రూ.1,400.22గా ఉందని చెప్పారు. ఒక్కో కిట్‌లో దోమల నివారణ వలతో కూడిన బేబీ బెడ్, బేబీ మాకింటోష్, శిశువుల దుస్తులు, బేబీ టవల్, ఉతికి మళ్లీ ఉపయోగించుకునే బేబీ న్యాపీలు మూడు, 200 గ్రాముల బేబీ పౌడర్, 100 మి.లీ. బేబీ షాంపూ, 200 మి.లీ. బేబీ ఆయిల్, బేబీ సబ్బు, సబ్బు పెట్టె, రాటిల్ టాయ్, కిట్ బ్యాగ్ ఉంటాయని మంత్రి వివరించారు.

# హైకోర్టులో జడ్జిలకు శాశ్వత హోదా

- కొలీజియం సిఫార్సుకు కేంద్రం ఓకే

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి శాశ్వత హోదా కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుకు కేంద్రం బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో ఏపీ హైకోర్టులో జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ తోట చంద్ర ధన శేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాధ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించింది. ఈ రోజు జరిగిన కొలీజియం సమా వేశంలో ఈ సిఫార్సుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే వరకు ఏపీ హైకోర్టు లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేసిన వీరంతా.. ఇకపై శాశ్వత న్యాయమూర్తులుగా విధులు నిర్వ హించనున్నారు. 2024, అక్టోబర్ 28వ తేదీన జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ తోట చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్.. అలాగే 2025, జనవరి 24న జస్టిస్ అవధానం హరిహరనాధ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులు అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు.

# పండుగల్లో శబ్ద కాలుష్యం నివారించాలి!

## బాంబే హైకోర్టు సీరియస్

### మతపరమైన ఊరేగింపుల్లో లౌడ్‌స్పీకర్లు ఎందుకని ప్రశ్న



**ముంబయి, సెప్టెంబరు 23:** బాణసంచా, డీజేలు, లేజర్ బీమ్స్‌పై బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పండుగలను శబ్ద, వాయు కాలుష్యానికి కారణం కాకుండా జరుపుకోవచ్చని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన ఊరేగింపుల్లో లౌడ్‌స్పీకర్లు, డీజేలు, లేజర్ బీమ్స్ వినియోగం కూడా పూర్తిగా అనవసరమని వ్యాఖ్యానించింది. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఈ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ గిరీష్ కులకర్ణి, జస్టిస్ నీలా గోఖలేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. దేవుడి ఆశీర్వాదం కోసం డీజేలు, బాణసంచా అవసరమా లౌడ్‌స్పీకర్లు, బాణసంచా ఉపయోగించడం వల్ల దేవుడి నుంచి అదనపు ఆశీర్వాదాలు లభిస్తాయా అని హైకోర్టు ప్రశ్నించింది. బాధ్యతాయుతమైన సమాజంగా ఇలాంటి వాటికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. పండుగల సమయంలో శబ్ద, వాయు కాలుష్యం లేకుండా వేడుకలు నిర్వహించవచ్చని పేర్కొంది. ఇందుకు పందర్‌పూర్‌కు జరిగే వారీ యాత్రను ఉదాహరణగా కోర్టు ప్రస్తావించింది. ఎలాంటి లౌడ్‌స్పీకర్లు, పెద్ద శబ్దాలు లేకుండా ఆ యాత్ర ప్రశాంతంగా సాగుతుందని తెలిపింది. ఊరేగింపుల సమయంలో రోడ్లపై బాణసంచా కాల్చడం ప్రమాదకరమే కాకుండా విషపూరిత కాలుష్యానికి కారణమవుతుందని కోర్టు పేర్కొంది. ముంబై వంటి నగరంలో ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడానికి ఎందుకు అనుమతించాలి ముంబైలో ఈ సమయంలోనే వాయు కాలుష్యం పెరిగి పొగమంచు వాతావరణం ఏర్పడుతుంది. దీన్ని ఆపాల్సిన అవసరం ఉంది. పగలైనా, రాత్రయినా ప్రజా రహదారులపై బాణసంచా కాల్చకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఊరేగింపుల సమయంలో తీవ్ర శబ్ద, వాయు కాలుష్యంపై హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించింది. విచారణ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ మిలింద్ సాఠే వాదనలు వినిపించారు. ఈనెల 9 నుంచి 26 వరకు అనుమతి లేకుండా ఐదుగురికి మించి వ్యక్తులు గుమిగూడడాన్ని ముంబై పోలీసులు నిషేధించారని ఆయన తెలిపారు. బాణసంచా, లౌడ్‌స్పీకర్లపైనా పూర్తి నిషేధం అమల్లో ఉందని చెప్పారు. ఈ నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా అని కోర్టు ప్రశ్నించింది. నిబంధనలు కాగితాలపై మాత్రమే బాగున్నాయని, వాటి ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడాన్ని ఇకపై నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది.

ఊరేగింపుల సమయంలో శబ్ద తీవ్రతను నియంత్రించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లం ఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచిం చింది. పోలీసుల నుంచి అనుమతి పొందిన అన్ని కార్యక్రమాలు, ఊరేగింపుల నిర్వాహకులు ఆ అనుమతిని స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ నిబంధన అన్ని పండుగలకు వర్తిస్తుందని పేర్కొంది. ఊరేగింపులకు అనుమతి కోరే నిర్వాహకుల నుంచి ప్రభుత్వం భారీ మొత్తంలో సెక్యూరిటీ డిపాజిట్ తీసుకునే విషయాన్ని పరిశీలించాలని హైకోర్టు సూచించింది. గణేశ్ మండపాలకు నిధుల కొరత లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేసేలా నిబంధనలు రూపొందిస్తే అది నిరోధకంగా పనిచేస్తుందని కోర్టు పేర్కొంది. తాము ఎలాంటి పండుగ లేదా వేడుకలకు వ్యతిరేకం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే వేడుకల పేరుతో నిబంధనలను ఉల్లంఘించడం, ఇతర పౌరులకు ఇబ్బంది కలిగించడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. మతపరమైన భావాలను ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణతో సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. ఎవరి ప్రాణాలకు లేదా ఆరోగ్యానికి ముప్పు కలిగేలా వేడుకలు నిర్వహించకూడదని స్పష్టం చేసింది.

# 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే!

## స్పష్టం చేసిన ఇసి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే సర్ సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# మాకూ సమయం వస్తుంది మిమ్మల్ని వదలం

## ఎన్నికల సంఘంపై రాహుల్ ఫైర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ సమయం వస్తుంది మిమ్మల్ని వదలం అంటూ హెచ్చరించారు. ఓటు చోరీ భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. ‘సర్’ సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ‘సర్’ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

# విదేశీ ఉద్యోగాలపేరిట మోసాలపై హోంశాఖ అలర్ట్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో (“డాంకీ రూట్స్“) విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రం నిర్దేశించింది. సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో వస్తున్న అనుమానాస్పద ఉద్యోగ ప్రకటనలపై సైబర్ సెల్స్ ద్వారా నిఘా ఉంచాలని సూచించింది. బాధితుల నుంచి డిజిటల్ సంభాషణలు, నగదు చెల్లింపుల రికార్డులను కీలక ఆధారాలుగా వెంటనే సేకరించాలని ఆదేశించింది.



# రాధ ఫిర్యాదుపై సోదరి అంబిక ఫైర్!

**చెన్నై, సెప్టెంబరు 23:** ఒకప్పటి ప్రముఖ నటీమణులు, అక్కచెల్లెళ్లు అయిన అంబిక, రాధల మధ్య ఆస్తి వివాదం ముదిరింది. తనపై సోదరి రాధ చేసిన ఆరోపణలను అంబిక తీవ్రంగా ఖండించారు. తనను దొంగగా చిత్రీకరించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవహారాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లడం తనను మానసిక వేదనకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. దాదాపు రూ. 46 కోట్ల విలువైన చెక్కులను తాను, తన సోదరుడు మల్లికార్జున్ కాజేయాలని చూశామంటూ రాధ చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై అంబిక స్పందించారు. ఈ ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, తాను ఎటువంటి తప్పు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. చిన్నతనం నుంచి కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించానని, అటువంటి తనపై రాధ గదిలో నుంచి చెక్కులు దొంగిలించానని నిందలు వేయడం బాధాకరమని అన్నారు. రాధ తన వస్తువుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటుందని, నంబర్ లాక్ ఉన్న బ్యాగులనే వాడుతుందని, అటువంటప్పుడు దొంగతనం జరగడం అసాధ్యమని అంబిక వెల్లడించారు. ఈ వివాదానికి మూలకారణం ఆస్తి గొడవలేనని అంబిక తెలిపారు. ఏఆర్ఎస్ గార్డెన్‌ను తాను ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించానని, దివంగత ఎంజీఆర్ ఆశీస్సులతో ఆ పేరు పెట్టానని ఆమె గుర్తుచేశారు. అయితే, ఆ పేరును ఆర్.ఆర్. గార్డెన్‌గా మార్చి, తనకు రావాల్సిన వాటాను నిరాకరించడంతోనే న్యాయ పోరాటం చేయాల్సి వచ్చిందని ఆమె వివరించారు. ఈ సమస్యను కుటుంబ సభ్యుల మధ్యే పరిష్కరించుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, అవి ఫలించలేదని అంబిక పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున, న్యాయవ్యవస్థపై గౌరవంతో ఈ అంశంపై ఇకపై బహిరంగంగా మాట్లాడబోనని ఆమె స్పష్టం చేశారు.

# హాస్టళ్ల మెనూలో గొడ్డుమాంసం!

## విద్యార్థుల విజ్ఞప్తిని పరిశీలిస్తున్న టివికె సర్కార్



**చెన్నై, సెప్టెంబరు 23:** తమిళనాడులోని ప్రభుత్వ విద్యార్థి హాస్టళ్ల మెనూలో గొడ్డు మాంసం చేర్చే అంశం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. కొందరు విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక న్యాయ శాఖ మంత్రి వన్ని అరసు తెలపడంతో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నై సైదాపేటలోని ఎం.సి. రాజా సోషల్ జస్టిస్ హాస్టల్‌ను తనిఖీ చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు చికెన్, మటన్ అందిస్తున్నామని, సోమవారాల్లో బిర్యానీ కూడా వడ్డిస్తున్నామని తెలిపారు. అయితే, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కొందరు విద్యార్థులు మటన్ ధర చాలా ఎక్కువగా ఉందని, తమ ఇళ్లలో కూడా తినరని, కాబట్టి దాని స్థానంలో బీఫ్‌ను మెనూలో చేర్చాలని కోరినట్లు మంత్రి వివరించారు. ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, భిన్నాభిప్రాయాలు ఉన్నందున విద్యార్థులు, అధికారులతో చర్చించిన తర్వాతే ఒక నిర్ణయానికి వస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే విద్యార్థుల అభిప్రాయాల మేరకు ఉప్మా, కిచిడీ వంటి వాటిని తొలగించి, ఇడ్లీ, దోశ వంటివి మెనూలో చేర్చామని గుర్తుచేశారు. మంత్రి వన్ని అరసు ప్రకటనపై పుతియ తమిళగం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె. కృష్ణసామి తీవ్రంగా స్పందించారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో బీఫ్ సర్వసాధారణ ఆహారం కాదని, చికెన్, మటన్‌నే ఎక్కువ మంది తింటారని అన్నారు. ఇది కొందరి వ్యక్తిగత అభిరుచిని అందరి డిమాండ్‌గా చిత్రీకరించడమేనని విమర్శించారు. ఒకవేళ ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే రాజకీయ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, మంత్రి తన పదవిని కూడా కోల్పోవాల్సి రావచ్చని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, అటు విద్యార్థుల కోరిక, ఇటు రాజకీయ పార్టీల వ్యతిరేకతతో ఈ విషయం తమిళనాడులో హాట్ టాపిక్‌గా మారింది.

# ఐఎంఇఐ నంబరు మార్చాలని చూస్తే కఠిన చర్యలు

## మూడేళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా..కేంద్రం కసరత్తు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** మొబైల్ ఫోన్ల భద్రత పరంగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఫోన్‌కు సంబంధించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య అయిన ఐఎంఇఐ నంబర్‌ను ఉద్దేశపూర్వకంగా మార్చడం, తొలగించడం లేదా ట్యాంపరింగ్ చేయడం తీవ్రమైన నేరమని బుధవారం స్పష్టం చేసింది. ఈ నేరానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయని అధికారిక ప్రకటనలో హెచ్చరించింది. ఇలాంటి నేరాలను కాగ్నిజబుల్, నాన్‌బెయిలబుల్ నేరాలుగా పరిగణిస్తామని, అంటే పోలీసులు వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చని తెలిపింది.ఐఎంఇఐ ట్యాంపరింగ్‌కు సహకరించే హార్డ్‌వేర్ లేదా సాఫ్ట్‌వేర్‌ను కలిగి ఉండటం, ఉత్పత్తి చేయడం, లేదా వినియోగించడం కూడా చట్టవిరుద్ధమని ప్రభుత్వం పేర్కొంది. పౌరులు తమ మొబైల్ ఫోన్ల భద్రతను, ప్రామాణికతను నిర్ధారించుకోవడానికి సంచార్ సాథి ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవాలని సూచించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కొనుగోలు చేసిన ఫోన్ ఐఎంఇఐ వివరాలు, బ్రాండ్, మోడల్ వంటివి సరిచూసుకోవచ్చు. నకిలీ పత్రాలు సమర్పించి సిమ్ కార్డులు పొందడం, మోసం చేయడం, ఇతరుల పేరుతో సిమ్ కార్డులు వాడటం వంటివి కూడా శిక్షార్హమైన నేరాలని ప్రభుత్వం గుర్తుచేసింది. తమ పేరు మీద తీసుకున్న సిమ్‌లను ఇతరులకు బదిలీ చేయడం, అమ్మడం వంటివి చేయరాదని, వాటిని దుర్వినియోగం చేస్తే అసలు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే, మొబైల్ యాప్స్ లేదా ఇతర మార్గాల ద్వారా కాలర్ ఐడీ (సీఎల్ఐ)ని మార్చడం కూడా చట్టవిరుద్ధమని తెలిపింది. పౌరులు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి. ఆ తర్వాత టెలికాం ఆపరేటర్ నుండి పోయిన నంబర్‌పై డూప్లికేట్ సిమ్ కార్డు పొందాలి. ట్రాయ్ నిబంధనల ప్రకారం, కొత్త సిమ్ యాక్టివేట్ అయిన మొదటి 24 గంటల వరకు ఎస్ఎంఎస్ సేవలు నిలిపివేయబడతాయి. సంచార్ సాథి పోర్టల్‌లో ఫిర్యాదుకు ఓటీపీ అవసరం కాబట్టి, సిమ్ యాక్టివేట్ అయిన 24 గంటల తర్వాతే ఫోన్ బ్లాకింగ్ రిక్వెస్ట్ నమోదు చేయాలి. సంచార్ సాథి వెబ్‌సైట్ లేదా యాప్‌లో పోలీస్ రిపోర్ట్, గుర్తింపు కార్డు అప్‌లోడ్ చేసి ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చు. ఒకవేళ ఫోన్ తిరిగి దొరికితే, ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆ తర్వాత పోర్టల్‌లో రిక్వెస్ట్ ఐడీ ద్వారా ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

# సంక్షిప్త వార్తలు

## ఈస్టర్ బాంబింగ్‌కేసులో దోషులకు 260 సంవత్సరాల జైలు!

**కొలంబో, సెప్టెంబరు 23:** శ్రీలంకలో ఏడేళ్ల క్రితం పెను విషాదాన్ని మిగిల్చిన 2019 ఈస్టర్ ఆదివారం నాటి ఆత్మాహుతి బాంబు దాడుల కేసులో కొలంబో హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం, వారికి 200 నుంచి 260 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ తీర్పు వెలువడింది.

మంగళవారం ఈ తీర్పును ప్రకటించిన కోర్టు, ప్రధాన నిందితుడిగా ఉన్న నౌఫర్ మోలవితో పాటు మిగతా వారికి శిక్షలు ఖరారు చేసింది.

## కరం వేడుకల్లో విషాదం.. నీట మునిగి ఐదుగురు మృతి

**రాంచి, సెప్టెంబరు 23:** గిరిజన పండుగ అయిన కరం వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా పూజించిన చెట్టు కొమ్మను ఈ తెల్లవారుజామున నిమజ్జనానికి తీసుకెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. నిమజ్జనం చేసే క్రమంలో నదిలోకి దిగిన ఐదుగురు వ్యక్తులు ప్రవాహంలో కొట్టుకు పోయారు. పాలము జిల్లాలోని మారుమూల బొకాయ గ్రామంలో ఆదివాసీలు సంప్రదాయ కరం వేడుకలు నిర్వహించారు.



## మెర్సిడిస్ గ్యారేజీలో అగ్నిప్రమాదం.. ఎనిమిది కార్లు దగ్ధం



**జైపూర్, సెప్టెంబరు 23:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసు కుంది. సంగనేర్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని బాలాజీ మార్కెట్‌లో ఉన్న ఓ మెర్సిడెస్ వర్క్‌షాప్‌లో నిన్న రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో సుమారు 8 లగ్జరీ కార్లు, ఖరీదైన విడిభాగాలు, ఇతర యాక్సెసరీలు కాలి బూడిదయ్యాయి. ప్రమాద తీవ్రతకు దట్టమైన పొగలు దాదాపు 5 కిలోమీటర్ల దూరం వరకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 10 ఫైరింజన్లు రంగంలోకి దిగి, రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి.

## యెమెన్ జైలుపై హౌతీల దాడి: తొమ్మిది మంది ఖైదీల మృతి

**సనా, సెప్టెంబరు 23:** యెమెన్‌లో తమ నియంత్రణలో ఉన్న ఒక జైలుపై సౌదీ అరేబియా వైమానిక దాడులకు పాల్పడిందని, ఈ ఘటనలో తొమ్మిది మంది ఖైదీలు మరణించారని హౌతీ రెబల్స్ మంగళవారం ఆరోపించారు. ఉత్తర యెమెన్‌లోని అల్‌జౌఫ్ ప్రావిన్స్ రాజధాని అల్ హజ్మ్‌లో సోమవారం రాత్రి ఈ దాడి జరిగినట్లు వారు వెల్లడించారు. ఇటీవల జరిగిన పోరాటాల్లో పట్టుబడిన ఖైదీలను ఈ జైలులో ఉంచినట్లు హౌతీలు పేర్కొన్నారు. ఈ దాడిని హౌతీల ఖైదీల వ్యవహారాల కమిటీ అధినేత అబ్దుల్ ఖాదర్ అల్‌ముర్తాదా తీవ్రంగా ఖండించారు.

## మాజీ ప్రధాని ఇమ్రాన్ విడుదల కోసం భారీ ర్యాలీ!



**కరాచి, సెప్టెంబరు 23:** పాకిస్తాన్ మాజీ ప్రధాని, ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాకిస్థాన్ తెహ్రీక్‌ఇన్సాఫ్ ఈనెల 27న ఇస్లామాబాద్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. దీంతో పాకిస్తాన్ వ్యాప్తంగా టెన్షన్ వాతావణం నెలకొంది. ఇస్లామాబాద్ వ్యాప్తంగా భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు. రాజధానిలోకి రాకుండా అడ్డుకునేందుకు రోడ్లపై కంటైనర్లను మోహరించి ఒక గోడలా మారుస్తున్నారు. వేలాది మంది పోలీసుల్ని రంగంలోకి దింపారు. ఇస్లామాబాద్ ఆస్పత్రులను హైఅలర్ట్‌లో ఉంచారు. ఇస్లామాబాద్, రావల్పిండిలో భద్రతా సిబ్బందిని మోహరించారు.

# డిసెంబరులో ప్రధాని మోడీ అమెరికా, కెనడా పర్యటన!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఏడాది డిసెంబర్‌లో అమెరికాలో పర్యటించే అవకాశం ఉంది. ఫ్లోరిడాలోని డొరల్‌లో డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే జీ20 దేశాధి నేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆతిథ్యం ఇస్తున్న ఈ సదస్సును 2009 తర్వాత అమెరికా నిర్వహించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. మోడీకి ట్రంప్ అధిక ప్రాధాన్యం ఇస్తారని, వారిద్దరి మధ్య బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని అమెరికా రాయబారి సెర్జియో గోర్ గతంలోనే వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇదే సదస్సు వేదికగా భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల కూటమి ఖ్వాడ్‌ఖి నేతల సమావేశం నిర్వహించేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. అమెరికా పర్యటన ముగిసిన అనంతరం మోడీ కెనడాలో కూడా పర్యటించే అవకాశం ఉందని సమాచారం. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్ కెనడా మధ్య సమగ్ర వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. జీ20 సదస్సు కోసం ప్రధాని డిసెంబర్‌లో అమెరికా వస్తారని యూఎస్ రాయబారి జూన్‌లోనే సంకేతాలు ఇచ్చారు. భారత ప్రభు త్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలు వడాల్సి ఉంది. సాధారణంగా పర్యటన తేదీలకు సమీపంలోనే విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేస్తుంది. ఈ పర్యటన ఖరారైతే భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలు, ఇండోపసిఫిక్ వ్యూహం కీలక అంశాల్లో పురోగతికి బాటలు వేసినట్లవుతుంది.

# ఇమ్మిగ్రేషన్ సమస్యలపై భారతీయ కుటుంబాలు ఆందోళన

## మాసాచుసెట్స్ కాంగ్రెస్ సభ్యునితో ప్రతినిధుల భేటీ

**వోర్సెస్టర్, సెప్టెంబరు 23:** అమెరికాలో ఇమ్మిగ్రేషన్ సమస్యలతో విద్యార్థులు, కుటుంబాలు, వైద్య నిపుణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై మసాచుసెట్స్‌లోని ష్రూస్‌బరీలో కాంగ్రెస్ సభ్యుడు జిమ్ మెక్‌గవర్న్‌తో సమావేశమయ్యారు. ఈనెల 19న ఇండియా వోర్సెస్టర్ సెంటర్‌లో జరిగిన ఈ భేటీలో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీకి చెందిన వైద్యులు, వ్యాపారవేత్తలు, నిపుణులు, పౌర హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు. ఇమ్మిగ్రేషన్, ఆరోగ్య సేవలు, ఆర్థిక అవకాశాలు, పౌర భాగస్వామ్యం, అమెరికాభారత్ సంబంధాలపై చర్చించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను ఎదుర్కొనే క్రమంలో విద్యార్థులు, కుటుంబాలు, వైద్య నిపుణులు సహా పలువురు వలసదారులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. అయితే నిర్దిష్ట ఇమ్మిగ్రేషన్ ప్రతిపాదనలను మాత్రం కమ్యూనిటీ నాయకులు వెల్లడించలేదు. అమెరికాలోని వివిధ మతాలు, రాజకీయ అభిప్రాయాలకు చెందిన భారతీయులు పౌర వ్యవహారాల్లో తమ వాణిని వినిపించాలని నాయకులు కోరారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో నిరంతరం నేరుగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా భారత్ పౌర అణు ఒప్పందానికి గతంలో ఇండియన్ అమెరికన్లు వివిధ పార్టీల మధ్య మద్దతు కూడగట్టడంలో పోషించిన పాత్రను కూడా సమావేశంలో గుర్తు చేశారు. రెండు పార్టీల సహకారంతోనే ఆ ఒప్పందం సాధ్యమైందని యూఎస్ ఇండియా సెక్యూరిటీ కౌన్సిల్ వ్యవస్థాపకుడు రమేశ్ విశ్వనాథ్ కపూర్ పేర్కొన్నారు. టెక్నాలజీ, వాణిజ్యం, ఇంధనం, ఆరోగ్యం, విద్య, రక్షణ, పరిశోధన రంగాల్లో అమెరికాభారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ కీలక పాత్ర పోషించగలదని నాయకులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ప్రజాప్రతినిధులతోచర్చలు కొనసాగించాలన్నారు.




# మేఘాలయ యుడిపిలో అంతర్గత సంక్షోభం

## ఒకేసారి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బిజెపిలో చేరిక

**షిల్లాంగ్, సెప్టెంబరు 23:** మేఘాలయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. బుధవారం న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లఖ్‌మెన్ రింబుయ్, పియస్ మార్వీన్, కిర్మెన్ ష్యల్లా, మైరాల్బోర్న్ సియెమ్, మ్యాథ్యూ కుర్బా ఒల్లాన్ సింగ్ సుయిన్, బాలాజిద్ కుపర్ సిన్రెమ్, సిన్షర్ లింగ్డోహ్ థబాహ్ ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు చేరడంతో 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య 2 నుంచి 10కి పెరిగింది. దీంతో అసెంబ్లీలో బీజేపీ రెండో అతిపెద్ద పార్టీగా మారినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.యుడిపికి మొత్తం 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఎనిమిది మంది ఒకేసారి బీజేపీలో చేరడం ఆ పార్టీ అసెంబ్లీ బలాన్ని గణనీయంగా మార్చింది. బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిపినట్లు ముందుగా వెల్లడైంది. కోల్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలు, ఖాసీ భాషకు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో స్థానం, మేఘాలయ రెసిడెంట్స్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ యాక్ట్ అమలు, థెమ్ ఐవ్ మావ్‌లాంగ్‌లోని హరిజన్ కాలనీ తరలింపు వంటి స్థానిక అంశాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు నివేదికలు తెలిపాయి. అయితే బీజేపీలో చేరిన తర్వాత ఈ అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది భవిష్యత్తులో స్పష్టమవుతుంది.

# చిన్నతనంలోనే కండరాల క్షీణతపై దృష్టి

- అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర సేవలు అభినందనీయం : మంత్రి కందుల దుర్గేష్



మంత్రి కందుల దుర్గేష్‌తో అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర బేటీ

**అమరావతి.సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:**అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యుల కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 30 న మంగళగిరిలోని ఖిగోపు గ్రాండ్ఖి వేదికగా జరగనున్న ఖిసాహస్2026ఖి (వీల్స్ ఆఫ్ కరేజ్) కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రి దుర్గేష్ కి ఆహ్వాన పత్రిక అందజేశారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల కోసం ఈ కార్యక్రమంలో 130 ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌లను పంపిణీ చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ స్వయంగా దివ్యాంగురాలైనప్పటికీ, తోటి మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శోభారాణి సుంకర చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కండరాల క్షీణత బారిన పడిన వారికి అండగా నిలవడం, వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. చిన్నతనంలోనే ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తగిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఇటువంటి మహత్తర లక్ష్యంతో ముందుకు వెళ్తున్న సంస్థలకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయి చేయి కలిపి పనిచేస్తే భవిష్యత్తులో ఈ సవాల్‌ను సమర్థవంతంగా అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు.అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ద్వారా శోభారాణి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, తాను స్వయంగా పరిశీలించామని మంత్రి తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న ఈ బృహత్ ప్రయత్నాలు పూర్తి సత్ఫలితాలనివ్వాలని, మరిన్ని విజయాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

# అమరావతిలో ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం..

- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ నిపుణులు.
- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ సంస్థకు సీఎం చంద్రబాబు భూమి పూజ

**అమరావతి, సెప్టెంబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు అడుగులు పడ్డాయి. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. సుధా, వెంకట్ జాస్తి క్యాంపస్ పేరుతో 12 ఎకరాల్లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించనున్నారు. ఏటా సుమారు 3 లక్షల మందికి కంటి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణం కానుంది. చికిత్సలతో పాటు నేత్ర వైద్య పరిశోధన, శిక్షణ, కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలపైనా సంస్థ దృష్టి సారించనుంది. ప్రత్యేకంగా ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ శరవేగంగా నిర్మితమవుతున్న అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రావడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 3 కోట్ల కంటి చికిత్సలు అందించిన సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. అమరావతి కేంద్రాన్ని ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య పరిశోధన సంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ రంగాల్లోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు.పేదలకు కంటి వైద్యం అందించడంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ కీలక పాత్ర



అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ సంస్థకు భూమి పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు

పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 319 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు సకాలంలో చికిత్స అందించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. అమరావతిలో ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను సీఎం అభినందించారు.

**క్వాంటం కేంద్రంగా అమరావతి..**

ఇప్పుడు అమరావతి గురించి దేశం అంతా మాట్లాడుతోందని...మన ప్రజా రాజధానిని ప్రపంచం కూడా గుర్తిస్తోందని సీఎం అన్నారు. నోపోల్ సిటీ, బ్లూ గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు విస్తృతంగా హరిత ప్రాంతాలను అభివృద్ధి చేసి, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఐటీ తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు అవుతోందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఐదు క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు మూడు క్యూబిట్ కంప్యూటర్లను తయారు చేశాయని పేర్కొన్నారు. అక్టోబరు 3న వివిధ విశ్వవిద్యాలయాల్లో క్వాంటం కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అమరావతిలో ప్రస్తుతం సుమారు రూ.50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక మౌలిక వసతులు రానున్నాయని చెప్పారు. విట్, ఎస్ఆర్ఎం, అమృతానందమయి సంస్థలు ఇప్పటికే వచ్చాయని, త్వరలో బిట్స్ పిలానీ క్యాంపస్, ఎక్స్‌ఎల్ఆర్ఐ వంటి సంస్థలు కూడా రానున్నాయని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌లో భాగంగా బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ, ల్యాబొరేటరీ ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీ, క్వాంటం బయో వ్యాలీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరావతిలో బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా రాజధాని రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

## అక్టోబరు 3న పాన్‌ఐఐటీ సదస్సు..

అక్టోబరు 3న విజయవాడలో పాన్‌ఐఐటీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీల్లో చదివి ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొని మేధోమథనం చేయనున్నారని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ పనిచేస్తోందన్నారు. భవిష్యత్తులో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు అమరావతి కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు, పరిశోధనలకు గమ్య స్థానంగా రాజధాని నిలవాలని ఆకాంక్షించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కంటి వైద్యం, పరిశోధన, చికిత్స, శిక్షణలో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. సాంకేతికత, అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు జి.ఎన్ రావు తదితరులు హాజరయ్యారు.

ఫైల్డ్‌బై:ఘంటా విజయకుమార్

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీ

- మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రభుత్వ సమాచారాన్ని, ప్రజా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు విశ్వసనీయమైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి, ధ్రువీకరించి, ఎంప్యానెల్ చేసే విధంగా రూపొందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ సమాచార,పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.బుధవారం సమాచార శాఖ ప్రచార విభాగం సమావేశ ప్రాంగణంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు.ఈ దిశలో రూపొందించిన పాలసీకి మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల్లో ఈ పాలసీపై చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.డిజిటల్ ప్రచారం, ప్రజా సమాచారాన్ని బలోపేతం చేయడానికి ఐ అండ్ పీఆర్ శాఖ, ఏపీడీసీఎల్ సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లతో సమావేశాలు నిర్వహించి, వీటి ఆధారంగా ఇతర 6 రాష్ట్రాల విధానాలను పరిశీలించి ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పాలసీ ముసాయిదాను రూపొందించనున్నారు.పాలసీ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి



కార్యక్రమాలు, మౌలిక వసతులపై అధికారిక సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు విశ్వసనీయ ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి, ధృవీకరించి, ఏపీడీసీఎల్ ద్వారా ఎంప్యానెల్ చేయనున్నారు. సమాచారం నిష్పాక్షికంగా, వాస్తవాధారితంగా, ప్రజా ప్రయోజనకరంగా ఉండాలి.ఈ విధానం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్‌లోని కంటెంట్ క్రియేటర్లకు వర్తిస్తుంది. ప్రారంభ ఎంప్యానెల్‌మెంట్ ఒక సంవత్సరం ఉంటుందన్నారు.సంతృప్తికరమైన పనితీరు ఆధారంగా అధికార సంస్థ నిర్ణయంతో మరో రెండు సంవత్సరాల వరకు, ఒక్కోసారి ఒక సంవత్సరం చొప్పున పొడిగించవచ్చునని వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విశ్వసనీయ ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి, వారిని ఎన్‌రోల్ చేసుకోనున్నామన్నారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా కేటగిరీలుగా విభజించి పారితోషికం చెల్లిస్తారని వివరించారు.1,00,000 పైగా ఫాలోవర్లులు ఉంటే గరిష్ఠం గా రూ. 15,000,.50,000 నుంచి 99,999 ఫాలోవర్లు ఉంటే గరిష్ఠంగా రూ. 7,500. 25,000 నుంచి 49,999 ఫాలోవర్లు: గరిష్ఠంగా రూ. 5,000.10,000 నుంచి 24,999 ఫాలోవర్లు: గరిష్ఠంగా రూ. 2,500 చెల్లిసారని తెలిపారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో గోవా షిప్ బిల్డింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి మండలిలో నిర్ణయించారని పార్థసారథి వివరించారు. ఈ యూనిట్ ఏర్పాటుకు యాజమాన్యం తక్షణమే సిద్ధంగా ఉండటంతో, కృష్ణా జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని కేబినెట్ ధీమా వ్యక్తం చేసారు. షిప్‌యార్డు ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి లోకేష్‌కు మంత్రివర్గం ధన్యవాదాలు తెలిపిందని చెప్పారు. స్వర్ణ వార్డు సచివాలయంలోని ఎంట్రీ లెవెల్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రత్యేక సర్వీసు రూల్ జారీకి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ప్రభుత్వం ఎలాంటి జాబ్ చార్ట్ లేకుండా ఆలోచనారహితంగా రిక్రూట్ చేసిందని విమర్శించారు. సెప్టెంబర్‌లో పడిన వర్షాలు 3 శాతం అధికంగా ఉన్నప్పటికీ, మొత్తం సీజన్ వారీగా చూస్తే సాధారణ వర్షపాతం కన్నా 46 శాతం లోటు ఉందని చర్చించారు. వర్షాలు పడుతున్న తరుణంలో రైతులు వెంటనే విత్తనాలు వేసుకునేలా ప్రోత్స హించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాధన్ పాల్గొన్నారు.

# కొత్తపల్లి కెజిబివిలో విద్యార్థిని ఆత్మహత్య

- ఘటనస్థలంలో సూసైడ్‌నోట్ లభ్యం

**కొత్తపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన కొత్తపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న భవ్య అనే విద్యార్థిని హాస్టల్ బాత్‌రూంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీవ్ర కలకలం రేపింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె ఉన్నత చదువులు చదివి భవిష్యత్తు దిద్దుకుంటుందని ఆశపడ్డ తల్లిదండ్రులకు ఆ రాత్రి గుండె పగిలే వార్త తెలిసింది. అయితే ఈవిషయాన్ని పాఠశాల యాజమాన్యం తమకు వెంటనే తెలియజేయకుండా నిర్లక్ష్యం వహించిందని తమ బిడ్డ ప్రాణాలు పోయేవరకు కనీసం సమాచారం కూడ ఇవ్వలేదని భవ్య కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతూ ఆరోపిస్తున్నారు. ఈఘటనపై స్పందించిన ఆత్మకూరు డిఎస్పీ రామాంజినాయక్ విద్యార్థిని రాసిన సూసై



డ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నామని ఘటనపై కట్టుదిట్టమైన విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు. ఆత్మహత్యకు గల కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఘటన స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్ తీవ్ర భావోద్వేగానికి గురిచేసోంది. హాస్టల్‌కు వచ్చిన తర్వాత ఒక విద్యార్థిని తనకు పరిచయం అయిందని విన్ను మై సిస్టర్ అని భవ్య అందులో పేర్కొందని కానీ ఆమె నాతో మాట్లాడడం మానేసిందని దాని వల్ల తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నానని మాటాడమని ఎంత బలిమాలినా ఆమె పట్టించుకోవడం లేదని రాసింది. ఇద్దరి మధ్య వచ్చిన దూరం మన స్పర్ధలకు తాను కారణమని భావిస్తు ఆమె లేకపోతే తాను ఈప్రపంచంలో ఉండలేనని తాను వెళ్లిపోతున్నప్పటికి ఆమె ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని దేవున్ని కోరుకుంది. అలాగే అమ్మ నాన్న నన్ను క్షమించండి అంటూ తన తల్లిదండ్రులకు ఉద్దేశించి రాస్తు నాన్న తన చదువుకోసం భవిష్యత్తు కోసం ఎంతగానో కష్టపడ్డారని అలాంటి వారికి తీరని శోకాన్ని మిగిలిస్తున్నందుకు బాధపడుతున్నానని తెలిపింది. తాను తీసుకున్న తప్పుడు నిర్ణయమే అని తెలిసినా మనసులోని బాధను భరించలేక ఈ దారుణమైన అడుగు వేస్తున్నానని నా వల్ల మీకు ఎలాంటి కష్టం రాకూడదని అందరు జాగ్రత్తగా ఉండడండి, నన్ను మర్చిపొండి అంటూ తన ఆఖరిమాటను ముగించింది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

**దగదర్తి (నెల్లూరు), సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** మండలంలోని ఉలవపాళ్ల జాతీయ రహదారిపై ఐఓసీ పెట్రోల్‌బంక్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాళ్ల ఎస్సీ కాలనీకి చెందిన గోళ్ల రవికుమార్ (35), అతని స్నేహితుడు మచ్చల సునీల్ బుధవారం రాత్రి గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన అనంతరం రవికుమార్‌ను కప్పరాళ్లతిప్ప అంబేద్కర్‌నగర్‌లో వదిలి పెట్టేందుకు సునీల్ బైక్‌పై తీసుకెళ్లాడు. అక్కడికి చేరుకున్న అనంతరం రవికుమార్ తిరిగి ఉలవపాళ్లకు వస్తానని చెప్పడంతో ఇద్దరూ కలిసి తిరగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఉలవపాళ్ల ఐఓసీ పెట్రోల్ బంక్ సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు పక్కనే లారీ వెళ్తున్నట్టు లారీ వెనుక టైర్లు తగిలి పడ్డారా బండి అదుపుతప్పి పడ్డారా అని తేలాల్సి ఉందని, పెట్రోల్ బంకు దగ్గర ఉన్న వారు చెప్పారు. ప్రమాదంలో రవికుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సునీల్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మొబైల్ పోలీసులు, దగదర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

# వైభవంగా గణనాథుని ధ్వజావరోహణం

- ఘనంగా ఏకాంతసేవ, వడాయత్తు ఉత్సవం

**కాణిపాకం, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయ కస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈనెల 14 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విది తమే. ఇందులో భాగంగా 15న ధ్వజారోహణంతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ముందుగా ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, వసంతోత్సవం కార్యక్రమంను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఈనెల 15న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించగా, తొమ్మిది రోజులు అనంతరం బుధవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్తంభంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈసందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వడాయత్తు ఉత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వడలతో మాలవేసి, పెసరు పప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వీటిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం స్వామివారికి ఏకాంతసేవను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడానికి కంకణ దారులైన ఆలయ ఈఓ పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, అర్చకులు,తదితరులు కంకణ విసర్జన గావించారు.ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి,మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓ లు రవీంద్రబాబు, ధనపాల్ ఆలయ సూపరెంటెంట్‌లు వాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, రవిల తో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# వరకట్నం వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

**చిత్తూరు, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో వరకట్నం వేధింపుల కేసులో నిందితుడు ఆర్.సతీష్‌కు 6వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం బుధవారం మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలిలా వున్నాయి. జూన్ 2014లో తమిళనాడు కాట్పాడికి చెందిన కళైవాణి, యాదమరి మండలం రామభద్రాపురం గ్రామంకు చెందిన సతీష్‌కు హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. వివాహ సమయంలో కళైవాణి తల్లిదండ్రులు 20 సవర్ల బంగారంతో పాటు సుమో వాహనం కొనుగోలు కోసం 1.80 లక్షల రూపాయలు కట్నంగా ఇచ్చారు. వివాహం జరిగిన 3 నెలల అనంతరం కళైవాణి భర్త సతీష్ అదనంగా మరో 15 వేల రూపాయలు కట్నంగా తీసుకురావాలని వేధించడంతో ఆమె తల్లిదండ్రులు ఆ మొత్తంను సైతం ఇచ్చారు. ఈ క్రమంలో 17 డిసెంబర్



2014న అదనంగా రూ.50 వేలు కట్నం తీసుకురావాలని కళైవాణిని కోరడంతో ఆమె తల్లిదండ్రులను కోరగా వారు వచ్చి సతీష్ కోరిన మేరకు డబ్బులు ఇస్తామని నచ్చజెప్పి వెళ్ళారు. ఈ మేరకు నిందితుడు సతీష్ మద్యం సేవించి కళైవాణిని తరచు వేధిస్తూ ఆమెపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ చేసేవాడు. కుటుంబసభ్యులు, పెద్దలు పలుమార్లు ఈ విషయంపై పంచాయతీలు పెట్టి నచ్చజెప్పినప్పటికీ సతీష్ తీరులో మార్పు కన్పించలేదు. ఈ పరిస్థితుల్లో కళైవాణి 8 జనవరి 2015 సాయంత్రం కళైవాణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళైవాణి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేష్ కేసు నమోదు చేశారు. ఆపై పోలీసులు సతీష్‌ను 13 జనవరి 2015న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారించిన 6వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. కేసు విచారణను నిరంతరం పర్యవేక్షించిన కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె ఖాదర్ మొహియుద్దీన్, కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యాదమరి కానిస్టేబుల్ సురేష్‌ను, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జి ఇన్స్‌పెక్టర్ మనోహర్‌తో పాటు యాదమరి ఎస్ఐ ఈశ్వర్‌ను ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

# ఆ క్షణంలో రక్షించండి.. రహ్‌వీర్ పతకం పొందండి

- ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల బహుమతి

**ఏలూరు, సెప్టెంబరు 23, (ప్రభాతవార్త) :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినరహ్‌వీర్ పథకం కింద రూ.25.00 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తెలిపారు. రహదారి ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందేలా ప్రజల్లో ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ రహదారి భద్రత చర్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటలోపు బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 25 బ్లాక్‌స్పాట్లను గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో 23 జాతీయ రహదారులపై, రెండు ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వల్ల ప్రమాదాల్లో ప్రాణనష్టం జరుగుతోందన్నారు. కళాశాలల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చో విద్యార్థులకు వివరించాలని చెప్పారు. ఏలూరు నగరంలో ఆక్రమణల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు కాంతులు వెదజల్లే లైట్లు అమర్చుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని, అలాంటి లైట్లు విక్రయించే దుకాణాలపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామర్థ్యానికి మించి పాఠశాల విద్యార్థులను ఆటోల్లో తరలిస్తూ జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

# వందే భారత్ రైలు బోగీలో మంటలు

- ప్రయాణీకులంతా సురక్షితం

**విజయవాడ,సెప్టెంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని వందే భారత్ రైలు బోగీలో మంటలు చెలరేగాయి.దాంతో ప్రయాణీకులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.. నర్సాపూర్ చెన్నై వందేభారత్ రైలులో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచోసుకుంది. నర్సాపూర్ నుంచి రైలు విజయవాడ చేరుకుంటున్న సమయంలో సీ4 కోచ్ చక్రాల మధ్య యాక్సిల్‌లో ఒక్కసారిగా స్వల్పంగా మంటలు అంటుకున్నాయి. ఆపై పొగలు కమ్ముకున్నాయి. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. దీంతో అధికారులు రైలుని విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అనంతరం భయంతో బోగీలో నుంచి బయటకు పరుగులు తీశారు.బుధవారం సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత రైలు విజయవాడ చేరుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పటి నుంచి స్టేషన్‌లోనే వందే భారత్‌ను నిలిపివేశారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళన చెందారు. అగ్నిమాపక నియంత్రణా పరికరాలతో మంటల్ని ఆర్పివేశారు.ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా? మరో కారణమా? అనేదానిపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.రైల్వే సిబ్బంది వెంటనే ఆ కోచ్ వద్దకు చేరుకున్నారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరో రైలులో ప్రయాణికుల్ని చెన్నై పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. సాంకేతిక, భద్రతా బృందాలను అప్రమత్తం చేసి.. తక్షణం అవసరమైన చర్యలు చేపట్టారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ రైలు ప్రయాణికులకు వేచి ఉండే సౌకర్యం, తాగునీరు, ఆహారంతోపాటు సహాయం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామంది. ఈ ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ రైలు ఏర్పాటు చేశామని వివరించింది. ఈ అంశాన్ని రైల్వే అధికారులు పర్యవేక్షిస్తున్నారని రైల్వేశాఖ బులిటిన్‌లో చెప్పింది. అలాగే ప్రయాణికులకు అవసరమైన సహాయక చర్యలు అందిస్తున్నారని రైల్వే శాఖ పేర్కొంది.

## ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

- ధన్వంతరి హోమం నిర్వహణ
- సిసిఆర్ఎసి స్పార్క్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ
- పతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు..

**విజయవాడ సెప్టెంబర్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా.ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం మరియు ఆయుర్వేద వైద్య విధాన అభివృద్ధిని ఆకాంక్షిస్తూ శ్రీ ధన్వంతరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ రొణంకి, అదనపు డైరెక్టర్ డా.పి.సాయి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జె.ధనుంజయరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసిఆర్ఎసి – స్పార్క్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన యూజి విద్యార్థులు, పిజి స్కాలర్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అలాగే జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. ఈ వేడుకలు ఆయుర్వేద విద్య, పరిశోధన, వైద్య సేవలు మరియు ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన పెంపొందించడంలో డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల యొక్క నిబద్ధతను ప్రతిబింబించాయి.ఈ కార్యక్రమాన్ని డా.ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.బుల్లయ్య,డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పిజి స్కాలర్లు, ఇంటర్న్‌లు, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రికెట్ చరిత్రలోనే క్రేజీ మ్యాచ్‌కు ప్లాన్

### టీమిండియా వర్సెస్ రెస్టాఫ్ ఇండియా




**న్యూఢిల్లీ:** క్రికెట్ చరిత్రలోనే క్రేజీ మ్యాచ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్లాన్ చేస్తోంది. బీసీసీఐ ఏర్పడి 100 ఏళ్ల ఉత్సవాల భాగంగా, భారత 11వ జట్టు, మిగతా ప్రపంచ 11వ జట్టు (రెస్టాఫ్ ఇండియా) మధ్య ఒక ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించాలని యోచిస్తోంది. ఈ నెల 25 జరిగే బీసీసీఐ 95వ వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం)లో ఈ చారిత్రాత్మక శతజయంతి వేడుకలపై అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే డిసెంబర్ 2027 నుంచి 2028 వరకు ఏడాది పాటు శతాబ్ది ఉత్సవాలను బీసీసీఐ నిర్వహించనుంది. ఈ వేడుకలను పర్యవేక్షిందుకు బీసీసీఐ ఒక కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రస్తుతం ఈ చర్చలు ప్రాథిమిక దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐసీసీ వరల్డ్ ఎలెవన్ ఇప్పటి వరకు మొత్తం 9 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. వాటిలో జనవరి 2005లో ఆసియా ఎలెవెన్‌తో ఒక వన్డే, అక్టోబర్ 2005లో ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, ఒక టెస్ట్, సెప్టెంబర్ 2017లో పాకిస్థాన్‌తో మూడు టీ20లు, 2018 మేలో లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో ఒక టీ20 ఆడింది. భారత్ జట్టుతో మాత్రం ఐసీసీ ఎలెవన్ ఇప్పటి వరకు ఒక్క అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడలేదు. ఒకవేళ భారత్, రెస్టాఫ్ ఇండియా మ్యాచ్‌ను ప్లాన్ చేస్తే, వన్డే ఫార్మాట్‌లో నిర్వహించే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఇక బీసీసీఐ భారత స్వాతంత్ర్యానికి ముందే 1928 డిసెంబర్ 1న ఏర్పాటైంది. 2028 డిసెంబర్ 1 వరకు 100 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఐసీసీ ర్యాంకింగ్స్ ద్వారా ఐసీసీ వరల్డ్ ఎలెవన్‌ను ఎంపిక చేయనున్నారు. ఈ క్రేజీ మ్యాచ్‌ను ఎప్పుడు నిర్వహిస్తారనేదానిపై ఇంకా స్పష్టత తీసుకోలేదు. 2027 వన్డే ప్రపంచకప్ ముందే నిర్వహిస్తే భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు బరిలోకి దిగుతారు. మెగా టోర్నీ తర్వాత అయితే ఈ ఇద్దరూ దూరమయ్యే అవకాశం ఉంది. బీసీసీఐ సమావేశం తర్వాత ఈ క్రేజ్ మ్యాచ్‌పై క్లారిటీ రానుంది. ఈ సమావేశంలోనే టీమిండియా నయా ఛీఫ్ సెలెక్టర్ నియామకంపై కూడా నిర్ణయం తీసుకోనున్నారు.

# మూడు వన్డేల సిరీస్: ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

### 3-0తో ఛాంపియన్‌గా టీమిండియా



**రాజ్‌కోట్ :** భారత అండర్19 క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. రాజ్‌కోట్‌లో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డే మ్యాచ్‌లోనూ భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసి ఆస్ట్రేలియాపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఆసీస్ ఓపెనర్ జెడ్ హోలిక్ అద్భుతంగా ఆడి 87 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. అతనితో పాటు, నీల్ పటేల్ (51), బ్లేక్ కేటిల్ (38) రాణించడంతో ఆస్ట్రేలియా సవాల్ విసిరే స్కోరును సాధించగలిగింది. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వా, మనల్ చౌహాన్ అత్యద్భుతంగా బౌలింగ్ చేసి చెరో 3 వికెట్లు, కావ్య పటేల్, ఆర్యన్ సవసాని తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక ఆస్ట్రేలియా నిర్దేశించిన 255 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ తో (34) కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన లక్ష్య, ఆ తర్వాత కుషాగ్ర ఓజా (45)తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఒక దశలో భారత్ కొన్ని వికెట్లు కోల్పోయినా, కెప్టెన్ లక్ష్య మాత్రం అద్భుతమైన బ్యాటింగ్‌ను కొనసాగించి 110 పరుగులతో జట్టును గెలిపించాడు. అతనికి తోడుగా రజత్ బఫేల్ 44 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత జట్టు 41.2 ఓవర్లలోనే కేవలం 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసి సులభంగా విజయాన్ని అందుకుంది.

# ఆసియా క్రీడలు

## పురుషుల స్కీట్ టీమ్‌కు కాంస్యం

### వ్యక్తిగత ఫైనల్‌కు చేరిన అనంత్

**నగోయా:** ఆసియా గేమ్స్ 2026లో, ఒలింపియన్లు అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ అహ్మద్ ఖాన్‌లు భవతేగ్ సింగ్‌తో కలిసి పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య



పతకాన్ని గెలుచుకున్నారు. నగోయాలో బుధవారం జరిగిన ఈ క్రీడల్లో భారత త్రయం సంయుక్తంగా 346 స్కోరు సాధించి, భారతదేశానికి ఏడవ షూటింగ్ పతకాన్ని అందించింది. క్వాలిఫికేషన్‌లో 125కి 119 స్కోరు సాధించిన అనంత్‌జీత్, మెడల్ రౌండ్‌కు చేరిన పురుషుల జట్టులోని ఏకైక భారతీయ షూటర్‌గా నిలిచి వ్యక్తిగత ఫైనల్‌కు కూడా అర్హత సాధించాడు. మైరాజ్ 125కి 116, భావతేగ్ 125కి 111 స్కోరు సాధించడంతో ఫైనల్‌కు వీరిద్దరూ అర్హత సాధించలేకపోయారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్లలో కూడా భారత్ పతకం లేకుండానే ముగిసింది. మహిళల వ్యక్తిగత ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్ 181.1 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలవగా, అంతకుముందు భారత మహిళల జట్టు రెండు ఇన్నర్ 10 సెకన్ల తేడాతో కాంస్య పతకాన్ని కోల్పోయింది.




## వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాకు తొలి రజతం

**నగోయా:** భారత వెయిట్‌లిఫ్టింగ్ స్టార్ మీరాబాయి ఐచినగోయా ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రాత్మక రజత పతకాన్ని గెలుచుకుంది. నగోయా సిటీ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సెంటర్‌లో బుధవారం నాడు జరిగిన ఈ పోటీల్లో 32 ఏళ్ల మీరా 87 కేజీల స్నాచ్ మరియు 111 కేజీల క్లీన్ అండ్ జర్క్‌లను కలిపి మొత్తం 198 కేజీల బరువును ఎత్తింది. ఈ రజత పతకంతో, 1998లో బ్యాంకాక్‌లో కర్ణం మల్లేశ్వరి రజతం గెలుచుకున్న తర్వాత ఆసియా క్రీడలలో పతకం గెలిచిన తొలి భారత వెయిట్‌లిఫ్టర్‌గా చాను నిలిచారు, తద్వారా భారతదేశం యొక్క 28 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఇక ఉత్తర కొరియాకు చెందిన, రెండుసార్లు ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్ అయిన రీ సాంగ్‌గమ్, 94 కేజీల స్నాచ్ మరియు 121 కేజీల క్లీన్ అండ్ జర్క్‌తో కలిపి మొత్తం 210 కేజీల బరువు ఎత్తి స్వర్ణం సాధించారు. ఇండోనేషియాకు చెందిన విజయన లులుక్ డియాని ట్రి 191 కేజీల (87 కేజీల స్నాచ్, 103 కేజీల క్లీన్ అండ్ జర్క్) బరువుతో కాంస్యం గెలుచుకుంది.

## భారత్ జట్టు అజేయ పరంపర

### హాకీలో 20-1 థాయ్‌లాండ్‌పై విజయం

**గిఫు:** 2026 ఆసియా క్రీడల మహిళల హాకీ పోటీలలో భారత్ అజయ పరంపరతో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. గిఫు లో బుధవారం జరిగిన పూల్ బి మ్యాచ్‌లో థాయిలాండ్‌ను 20-1 తేడాతో చిత్తుగా ఓడించి మరో భారీ డబుల్ డిజిట్ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత్ కుదురుకోవడానికి కొంత సమయం పట్టింది. కానీ వెంటవెంటనే నాలుగు పెనాల్టీ కార్నర్‌లు లభించడంతో ఎనిమిదో నిమిషంలో దీపిక గోల్ చేసి



ఆధిక్యాన్ని అందించింది. ఈ మ్యాచ్‌లో దీపికా అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శనతో 9 గోల్స్ సాధించి స్టార్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. ఫార్వర్డ్, డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ అయిన ఈ భారత్ ప్లేయర్ ఈ గోల్స్‌ను పెనాల్టీ కార్నర్ల నుంచే సాధించింది. నవనీత్ కౌర్ 4 గోల్స్ సాధించగా, రుతుజా పిసాల్ హ్యాట్రిక్ పూర్తి చేసింది. నేహా, లాల్‌రెమ్సియామి, సాక్షి రాణా, కెప్టెన్ సలీమా టెటే కూడా గోల్స్ చేయగా, మ్యాచ్ ఆద్యంతం భారత్ నిరంతర ఒత్తిడిని కొనసాగించింది. నాలుగో క్వార్టర్ చివరిలో మాత్రమే థాయిలాండ్ క్లీన్ షీట్‌ను తప్పించుకోగలిగింది. పెనాల్టీ కార్నర్ నుండి సుపన్సా సమంసో డ్రాగ్‌ఫ్లిక్ చేసిన బంతి స్వల్పంగా పక్కకు మళ్లి భారత గోల్‌లోకి దూసుకెళ్లింది, తద్వారా మ్యాచ్‌లో థాయిలాండ్‌కు ఏకైక గోల్ లభించింది. ఉజ్బెకిస్తాన్‌ను 19-0 తేడాతో చిత్తుగా ఓడించి తమ ప్రచారాన్ని ప్రారంభించిన తర్వాత, ఇండోనేషియాను 17-1 తేడాతో ఓడించిన వీరికి ఇది వరుసగా మూడవ విజయం.

## ఇరాన్‌పై భారత్ మహిళలు విజయం





**నగోయా, జపాన్:** ఆసియా క్రీడల్లో కబడ్డీలో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, బుధవారం ఇక్కడ జరిగిన గ్రూప్‌స్టేజ్ మ్యాచ్‌లలో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌పై, మహిళల జట్టు ఇరాన్‌పై ఇరాన్‌పై సమగ్ర విజయాలు నమోదు చేశాయి. మహిళల జట్టు తమ రెండవ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో 2018 స్వర్ణ పతక విజేత ఇరాన్‌ను 37-23 తేడాతో సునాయాసంగా ఓడించింది. సగం ఆట ముగిసేసరికి 19-15 ఆధిక్యంలో ఉన్న భారత మహిళలు,

## కబడ్డీలో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించింది

రెండవ సగంలో కూడా తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుని ప్రత్యర్థులను పూర్తిగా అధిగమించారు. అలాగే పురుషుల జట్టు ఇక్కడ జరిగిన తమ మూడవ గ్రూప్ ఎ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 48-25 తేడాతో ఓడించింది. పురుషుల జట్టు మొదటి అర్ధభాగంలో 29-9 ఆధిక్యాన్ని సాధించారు. రెండవ అర్ధభాగంలో బంగ్లాదేశ్ మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ, వారు మ్యాచ్‌లో ఏ దశలోనూ పోటీలో నిలవలేకపోయారు. భారత మహిళల జట్టు అంతకుముందు తమ గ్రూప్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 42-21 తేడాతో ఓడించగా, పురుషుల జట్టు జపాన్‌ను 49-24 తేడాతో మరియు దక్షిణ కొరియాను 63-31 తేడాతో ఓడించింది.

# పశ్చిమాసియా సంకేతాలు

### లాభాల్లో దూసుకువెళ్లిన నిఫ్టీ, సెన్సెక్స్



**ముంబయి, సెప్టెంబరు 23:** అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొంత తగ్గుతున్నాయన్న సంకేతాలు, ముడి చమురు ధరలు వరుసగా తగ్గుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం పుంజుకున్నాయి. మెటల్, ఎఫ్‌ఎంసిజి, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 299.17 పాయింట్లు లాభపడి 74,828.25 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ50 సూచీ 117.80 పాయింట్లు పెరిగి 23,446.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభాల్లో బజాజ్ ఫైనాన్స్ 3.41 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో 1.64 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.61 శాతం చొప్పున పెరిగి కీలకంగా నిలిచాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.63 శాతం, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.65 శాతం చొప్పున లాభపడ్డాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు కనిపించింది. బిఎస్‌ఇలో 2,809 షేర్లు లాభపడగా, 1,579 షేర్లు నష్టపోయాయి. మరో 225 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్‌లో 2026 నవంబర్ సెటిల్‌మెంట్‌కు బ్రెంట్ క్రూడ్ ధర 2 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 99.23 డాలర్లకు చేరింది. అమెరికా 10 యేళ్ల బాండ్ రాబడి 0.16 శాతం పెరిగి 4.956 శాతానికి చేరింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి కూడా 0.31 శాతం పెరిగి 7.038 శాతానికి చేరింది. రూపాయి స్వల్పంగా బలహీన ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీన పడింది. పాక్షికంగా కన్వర్టిబుల్ రూపాయి 96.7325 వద్ద ట్రేడైంది. గత సెషన్‌లో ఇది 95.6250 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో 2026 అక్టోబర్ 5 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.40 శాతం తగ్గి రూ.1,52,110 వద్దకు చేరాయి.

360 వన్‌వామ్ షేరు 3.25 శాతం పెరిగింది. ఆదిత్య ఇన్ఫోటెక్‌షేరు 5శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. సుబెక్స్ షేరు 13.76 శాతం దూసుకెళ్లింది. అర్వింద్ స్మార్ట్‌స్పేసెస్ 7.39 శాతం లాభపడింది. ఓస్వాల్ పంప్స్ 3.54 శాతం పెరిగింది. గార్వేర్ హైటెక్ ఫిల్మ్స్ 2.09 శాతం లాభపడింది. స్కిప్పర్ షేరు 0.62 శాతం ఎగబాకింది.

# భారత్‌పై టారిఫ్‌లు విత్‌డ్రాచేసుకోండి

### అమెరికాకు జెపి మోర్గాన్ సిఇఓ సలహా



**న్యూయార్కు, సెప్టెంబరు 23:** రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని, శిక్షార్హమైన టారిఫ్‌లు విధించవద్దని అమెరికాకు ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెపి మోర్గాన్ చేజ్ సిఇఓ జేమీ డైమన్ సూచించారు. తొందరపడి ఏకపక్షంగా ముందుకెళ్తే అది కేవలం భారత్‌కే కాకుండా యావత్ ప్రపంచ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో పునరాలోచన చేయాలని సలహా ఇచ్చారు. జెపి మోర్గాన్ ఇండియా ఇన్వెస్టర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా ఓ ప్రముఖ మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న చమురుపై టారిఫ్‌లు విధించే ముందు అమెరికా ప్రభుత్వం క్షుణ్ణంగా ఆలోచించాలని అన్నారు. భారత రిఫైనరీలు రష్యా చమురును ఎలా వినియోగిస్తున్నాయో వాటి అవసరాలేమిటో వాషింగ్టన్ ముందుగా అర్థం చేసుకోవాలని హితవు పలికారు. భారత్‌పై ఆంక్షలు విధించే బదులు అమెరికా అధికారులు భారత్‌తో కూర్చుని అన్ని వాస్తవాలను చర్చించాలని సూచించారు.

రష్యాతో పోరాడేందుకు చేయాల్సినవి చేస్తూనే భారత్‌ను, ప్రపంచ చమురు మార్కెట్లను శిక్షించకుండా అమెరికా వ్యవహరిస్తుందని నేను ఆశిస్తున్నానని జేమీ డైమన్ పేర్కొన్నారు. రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. భారత రిఫైనరీలు ప్రాసెస్ చేస్తున్న రష్యా చమురుకు ప్రత్యామ్నాయాలను అంత సులభంగా కనుగొనలేకపోవచ్చని డైమన్ గుర్తుచేశారు. సరఫరాలో ఆకస్మిక మార్పులుచేస్తే అది భారత రిఫైనరీలకే కాకుండా విస్తృత ఇంధన మార్కెట్లకు కూడా నష్టం కలిగిస్తుందని వివరించారు.

# అంబానీని వెనక్కినెట్టేసిన బిలియనీర్ అదానీ




**ముంబయి, సెప్టెంబరు 23:** రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని వెనక్కి నెట్టి, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మళ్లీ అగ్రపీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026 రిలీజ్ చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అదానీ కుటుంబం మొదటి స్థానంలో ఉంది. గౌతమ్ అదానీ సంపద యేడాది వ్యవధిలోనే 13 శాతం మేర పెరిగి రూ. 9.23 లక్షల కోట్లకు చేరుకుంది. ముఖేష్ అంబానీ నికర విలువ 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు (90 బిలియన్ డాలర్లు) పరిమితమైంది. అంబానీ కంటే రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అదానీ మొదటి స్థానంలో నిలిచారు. భారతదేశంలో కనీసం రూ.1,000 కోట్ల సంపద కలిగిన వ్యక్తులు 1,810 మందికి చేరారు. వీరి మొత్తం సంపద విలువ 12.8 శాతం ఎగబాకి ఏకంగా రూ. 187.5 లక్షల కోట్లకు చేరింది. ఇది దాదాపు భారతదేశ జిడిపిలో సగానికి సమానం కావడం విశేషం. దేశంలో డాలర్ - బిలియనీర్ల సంఖ్య సరికొత్త గరిష్టమైన 391కి చేరుకుంది.

గత యేడాది కాలంలోనే కొత్తగా 27 మంది ఈ క్లబ్‌లోకి అడుగుపెట్టారు. మెటల్, స్టీల్, ఫార్మా రంగాలు ఈసారి అద్భుత పనితీరు కనబరిచాయి. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఎల్.ఎన్.మిట్టల్ సంపద 93 శాతం వృద్ధితో రూ.3.39 లక్షల కోట్లకు చేరి, మూడో స్థానానికి ఎగబాకింది. జాబితాలో అత్యధికంగా ఒక్క యేడాదిలోనే రూ.1.64 లక్షల కోట్ల సంపదను పెంచుకున్న వ్యక్తిగా ఆయన నిలిచారు. వేదాంత గ్రూప్ అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.2.08 లక్షల కోట్లతో 9వ స్థానానికి, జేబీ కెమికల్స్ విలీనంతో టోరెంట్ ఫార్మా సమీర్ మెహతా కుటుంబం రూ. 1.89 లక్షల కోట్లతో 10వ స్థానానికి దూసుకొచ్చాయి. బెంగళూరుకు చెందిన క్యూపీఐఏఐ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో హురున్ లిస్ట్‌లోకి ప్రవేశించిన తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ పారిశ్రామికవేత్తగా నిలిచారు. అలాగే ఎఐ ఆధారిత విస్పర్ ఫ్లో కంపెనీ ద్వారా కేవలం 28 యేళ్ల తనయ్ కొఠారి, సహజ్ గార్గ్ చెరో రూ. 4,200 కోట్ల సంపదతో ఎంట్రీ ఇచ్చి ఔరా అనిపించారు.

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ జెప్టో కోఫౌండర్ కైవల్య వోహ్రా 23 ఏళ్ల పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. ఈసారి జాబితాలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగి 131కి చేరింది. రూ. 2.79 లక్షల కోట్లతో రోష్ని నాడార్ మల్హోత్రా భారత అత్యంత ధనిక మహిళగా తన స్థానాన్ని నిలబెట్టుకోగా, అరిస్టా నెట్‌వర్క్స్‌కు చెందిన జయశ్రీ ఉల్లాల్ రూ. 77,400 కోట్లు స్వయంకృషితో ఎదిగిన నంబర్ 1 మహిళగా నిలిచారు. ఇక నగరాల విషయానికి వస్తే 465 మంది సంపన్నులతో దేశ ఆర్థిక రాజధాని ముంబై అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఢిల్లీ 236, బెంగళూరు 129 తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



## ఎన్‌టిపిసి రూ. 3,393.83 కోట్ల తుది డివిడెండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రభుత్వ రంగ విద్యుత్ దిగ్గజం ఎన్‌టిపిసి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,393.83 కోట్ల తుది డివిడెండ్‌ను చెల్లించింది. దీంతో ఆ ఆర్థిక సంవత్సరంలో వాటాదారులకు కంపెనీ చెల్లించిన మొత్తం డివిడెండ్ రూ.8,727 కోట్లకు చేరింది. బుధవారం చెల్లించిన తుది డివిడెండ్ కంపెనీ చెల్లించిన ఈక్విటీ షేర్ మూలధనంలో 35 శాతానికి సమానం. ఇప్పటికే 2025 నవంబర్, 2026 ఫిబ్రవరిలో రెండు విడతల్లో రూ.2,666.58 కోట్ల చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ఎన్‌టిపిసి చెల్లించింది.

ఈ మూడు విడతల చెల్లింపులను కలిపితే ఒక్కో ఈక్విటీ షేరుకు మొత్తం రూ.9 డివిడెండ్ అందింది. ఒక్కో షేర్ ముఖ విలువ రూ.10గా ఉంది. తాజాచెల్లింపుతో వరుసగా33వ ఏడాది డివిడెండ్ చెల్లించిన సంస్థగా ఎన్‌టిపిసి నిలిచింది. 91 గిగావాట్లకుపైగా విద్యుత్ సామర్థ్యం దేశంలోని అతిపెద్ద సమగ్ర విద్యుత్ సంస్థల్లో ఎన్‌టిపిసి ఒకటి.

## బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు తగ్గించేందుకు రూ.75,026 కోట్లకు ఆర్బీఐ వేరియబుల్ రివర్స్ రెపోరేట్ వేలం




**ముంబై, సెప్టెంబరు 23:** బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్య లభ్యతను తగ్గించే చర్యల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం ఓవర్‌నైట్ వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం ద్వారా రూ.75,026 కోట్లను వేలం వేసింది. రూ.75,000 కోట్లను ఉపసంహరించుకునేందుకు ఆర్బీఐ నోటిఫికేషన్ జారీ చేయగా బ్యాంకుల నుంచి రూ.87,993 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి. వీటిలో రూ.75,026 కోట్ల బిడ్లను మాత్రమే ఆర్బీఐ ఆమోదించింది. కట్‌ఆఫ్ రేటు, వెయిటెడ్ యావరేజ్ రేటు రెండూ 5.24 శాతంగా నమోదయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు లభ్యతను తగ్గించడం, ఓవర్‌నైట్ మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడం కోసం ఆర్బీఐ గత నెల నుంచి పలు రివర్స్‌రెపోరేట్ వేలాలను నిర్వహిస్తోంది. ఈనెల 22 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.4.45 లక్షల కోట్ల మేర మిగులు ద్రవ్య లభ్యత ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో ఆర్బీఐ ఈనెల 17న రూ.50,000 కోట్లు, 21న రూ.25,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా విక్రయించింది. ఓఎంఓ విక్రయాల సమయంలో బ్యాంకులు, ఇతర పెట్టుబడిదారులు ఆర్బీఐ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోని రూపాయి లభ్యత తగ్గుతుంది. ప్రస్తుత ద్రవ్య పరిస్థితులను నియంత్రించేందుకు మొత్తం రూ.1 లక్ష కోట్ల విలువైన ఓఎంఓ విక్రయాలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు ఆర్బీఐ ఇప్పటికే ప్రకటించింది. ఇందులో చివరివిడతగా రూ.25,000 కోట్ల విలువైన సెక్యూరిటీల విక్రయం సెప్టెంబర్ 28న జరగనుంది. ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్లతో భారీగా లిక్విడిటీబ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత భారీగా పెరగడానికి ప్రధాన కారణాల్లో ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్ల సమీకరణ ఒకటి. బ్యాంకులు పెద్ద మొత్తంలో ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్లను సమీకరించడంతో విదేశీకరెన్సీ వ్యవస్థలోకి వచ్చింది.

## బల్క్ డిపాజిట్లకు ఆర్బీఐ కొత్త నిబంధనలు



**ముంబయి, సెప్టెంబరు 23:** ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి రిజర్వ్‌బ్యాంకు తీసుకొచ్చిన కొత్త నిబంధనలు వచ్చే అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు ప్రధానంగా బల్క్ డిపాజిట్లకు సంబంధించినవి. ప్రస్తుతం షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లో రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని బల్క్ డిపాజిట్‌గా పరిగణిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం బల్క్ డిపాజిట్లపై బ్యాంకులు తమ అవసరాలు, లిక్విడిటీ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వడ్డీ రేట్లను నిర్ణయించుకునే వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా లిక్విడిటీ కవరేజ్ రేషియో ఫ్రేమ్‌వర్క్, అన్‌సెక్యూర్డ్ బల్క్ డిపాజిట్లకు వర్తించే రన్‌ఆఫ్ రేట్లను పరిగణనలోకి తీసుకుని వడ్డీ రేట్లను నిర్ణయించే అవకాశం ఉంటుంది. మరోముఖ్యమైన మార్పు వడ్డీ రేట్ల పారదర్శకతకు సంబంధించినది. బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై, ముఖ్యంగా బల్క్ డిపాజిట్లకు వర్తించే వడ్డీరేట్లను తమ వెబ్‌సైట్లలో స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. బల్క్ డిపాజిట్లకు సంబంధించిన రేట్లను ప్రతి పనిదినం ఉదయం నిర్ణీత సమయానికి అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అదే తేదీన, ఒకే మొత్తానికి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంకు శాఖల మధ్య వివక్ష లేకుండా ఒకే రకమైన వడ్డీ రేట్లు వర్తించేలా నిబంధనలు రూపొందించారు. అంటే ఒకే రకమైన డిపాజిట్‌ను ఒకే తేదీన స్వీకరించినప్పుడు శాఖల ఆధారంగా వేర్వేరు వడ్డీ రేట్లు ఉండకూడదు. ప్రధానంగా రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలోని బల్క్ డిపాజిట్లకు సంబంధించినవి కావడంతో సాధారణంగా చిన్న మొత్తాలతో చేసే రిటైల్ పెట్టుబడిదారులపై ప్రత్యక్ష ప్రభావం పరిమితంగానే ఉండే అవకాశం ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.